వాస్తవాలు పలుకు

# DD9 వార్త

తెలుగు దినపత్రిక

TE TL/26/A2635

హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:106 | 28-08-2026 శుక్రవారం | పేజీలు: 08 | వెల 3/-




## మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం..

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

6








2

## జిందాల్ వర్సిటీలో లెక్చర్‌కు కేటీఆర్‌కు ఆహ్వానం



# భద్రాచలం లో ఉద్యోగాల పేరుతో 'పైరవీ' దందా?

## ఎమ్మెల్యే పీఏ కేంద్రంగా భారీ వసూళ్ల ఆరోపణలు ?

- రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిరుద్యోగుల నుంచి వసూలు చేసినట్లు ప్రచారం
- రైల్వే ఉద్యోగం పేరుతో మరో రూ.10 లక్షల వ్యవహారం?
- క్యాంపు కార్యాలయం వేదికగా సాగినట్లు ఆరోపణలు.. సమగ్ర దర్యాప్తుకు డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్,ఆగస్టు 27 ( డిడి9 వార్త )**

ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు ఉద్యోగాల పేరుతో భారీగా డబ్బులు వసూలు చేసినట్లు వస్తున్న ఆరోపణలు భద్రాచలం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు (పీఏ) కేంద్రంగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాw లు ఇప్పిస్తామంటూ పలువురి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు బాధితుల వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

మిగతా 7వ పేజీలో..



## మిర్ ఆలం చెరువుకు కొత్త సొబగులు

- ఫ్యామిలీ టూరిస్టు హబ్‌గా అభివృద్ధి
- అకస్మికంగా పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి
- గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- సస్పెన్షన్ బ్రిడ్జి, వాటర్ స్పోర్ట్స్, ఐలాండ్ల అభివృద్ధికి ప్రణాళికలు

3



## హన్మకొండలో బీఆర్ఎస్ ధర్నా

- హరీష్ రావు అరెస్ట్
- పోలీస్ స్టేషన్ ముందు బైఠాయింపు

**వరంగల్, ఆగస్ట్ 27, :**

బీఆర్ఎస్ ఎల్పీఉప నేత తన్నీరు హరీష్ రావును హనుమకొండ సుబేదారిలో పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి

మిగతా 2వ పేజీలో..



3

## అక్కచెల్లెళ్లకు సీఎం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

## ట్రాఫిక్, రోడ్ సేఫ్టీపై కార్యాచరణ రూపొందించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**హైదరాబాద్, ఆగస్టు 27:**

హైదరాబాద్ నగరం, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ

మిగతా 3వ పేజీలో..



## ఏఐసీసీ పరిధిలో కొండా సురేఖ వ్యవహారం



- అధిష్టానం తీసుకునే నిర్ణయం ఆందరికీ శిరోధార్యం
- కాంగ్రెస్‌లో వ్యక్తిగత కోపాలకు తావు లేదు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

3




## రాష్ట్రంలో భారీగా ధాన్యం సైలోలు

- నిర్మాణం నుంచి నిర్వహణ వరకు ఎస్‌హెచ్‌జీలకు కీలక భాగస్వామ్యం
- అదనంగా 5 నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ నిల్వ సామర్థ్యం లక్ష్యం
- అత్యాధునిక సాంకేతికత వినియోగం
- మిల్లర్ల నుంచి బకాయిల వసూలుకు పటిష్ట కార్యాచరణ
- జీఈఎం, తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ధాన్యం వేలం
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

**హైదరాబాద్, ఆగస్టు 27, :**

రాష్ట్రంలో ఏటేటా విస్తరిస్తున్న వరి సాగు, గణనీయంగా పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి, ప్రభుత్వ సేకరణ అవసరాలకు దీర్ఘకాలిక పరిష్కారంగా అత్యాధునిక ధాన్య సైలోల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర పౌర సరఫరాల సంస్థను ఆదేశించారు. రాష్ట్రంలో అదనంగా 5 లక్షల నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ ధాన్య నిల్వ సామర్థ్యాన్ని సృష్టించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

## నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

- కడియంపై వ్యాఖ్యలు.. కౌశిక్ రెడ్డికి నోటీసులు
- కౌశిక్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నంపై వేముల ఆగ్రహం

2

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- ఏడుగురు మృతి.. కొందరికి తీవ్ర గాయాలు
- సిఎం చంద్రబాబు, మంత్రుల దిగ్భ్రాంతి
- సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు

**పల్నాడు, ఆగస్ట్ 27**

పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. చిలకలూరిపేట అడ్డ రోడ్డు

మిగతా 3వ పేజీలో..



## ఎన్‌హెచ్-65లో 17 ఫ్లైఓవర్లు త్వరగా పూర్తి చేయాలి



- చిట్యాల ఫ్లైఓవర్ ఈ దసరా నాటికి పూర్తికావాలి
- మిగతావి డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తేవాలి
- సంక్రాంతికి వాహనాల రాకపోకలు సాగాలి
- సమీక్షలో ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి

2




## ఈవీ పథకం కింద ఆటో డ్రైవర్లకు సాయం

- రూ.200 కోట్లు కేటాయిస్తూ జీవో జారీ

2

ఆటోరిక్షా డ్రైవర్లకు ప్రయోజనం కల్పించేలా పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్ 2026'ను అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ పథకం అమలుకు సిఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

# హన్మకొండలో బీఆర్ఎస్ ధర్నా

**మొదటిపేజీ తరువాయి**

వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. అలాగే వరంగల్, హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

**జీ.ఒ. 97ను రద్దు చేయాల్సిందే : హరీష్ రావు డిమాండ్**

పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 97 జీ.ఒ.ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు.

# ఎన్‌హెచ్-65లో 17 ఫ్లైఓవర్లు త్వరగా పూర్తి చేయాలి

**హైదరాబాద్, ఆగస్టు 27 ,:**

హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి 65పై చిట్యాల ఫ్లైఓవర్ ఈ దసరా నాటికి పూర్తిచేయాలని, మిగతావి డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తేవాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ ఫ్లైఓవర్ల నుండి ఈ సంక్రాంతికి వాహనాల రాకపోకలు సాగాలని అధికారులకు తేల్చి చెప్పారు. నిత్యం జరుగుతున్న ప్రమాదాలతో ఇప్పటికే వేలమంది తమ ప్రాణాలను కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. పలు రోడ్లు, ఎన్‌హెచ్ ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంతోపాటు ఇటీవల జరిగిన పలు ప్రమాదాలపై మంత్రి ఆరా తీశారు. హైదరాబాద్‌విజయవాడ రహదారిలో గుర్తించిన 17 బ్లాక్ స్పాట్స్‌పై నిర్మిస్తున్న ఫ్లైఓవర్లు, హైమాస్ట్ లైట్స్ పనుల పురోగతిని తెలుసుకున్నారు. దాదాపు అన్ని ఫ్లైఓవర్ల నిర్మాణం చివరి దశలో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పెద్దకాపర్తి ఫ్లైఓవర్‌పై ఇప్పటికే ట్రాఫిక్ అనుమతిస్తుండగా సూర్యాపేట ఫ్లైఓవర్ ట్రాఫిక్ అనుమతికి సిద్ధంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలపై, కొన్నిచోట్ల రహదారికి రెయిలింగ్ లేని వార్తలపై ఆరా తీసిన మంత్రి ఎన్‌హెచ్ఏఐ అధికారులకు పలు సూచనలు చేశారు. మూగ జీవాలు రహదారిపైకి రాకుండా రెయిలింగ్‌తోపాటు రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిత్యం ప్రమాదాలను నివారించాలంటే ఈ రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలన్నారు. రహదారి విస్తరణ కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిశామని గుర్తు చేశారు. రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులతో కలిసి మరోసారి నితిన్ గడ్కరీని కలుస్తాం.. అవసరమైతే ప్రధానమంత్రిని కలుస్తాం అన్నారు. ఎన్‌హెచ్ 65 విస్తరణ పనులతోపాటు బుల్లెట్ ట్రైన్స్, ఇతర ఎన్‌హెచ‌ఏఐ ప్రాజెక్ట్స్ త్వరగా చేపట్టాలని కోరతామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. సమీక్షలో ఆర్ అండ్ బి ఈఎన్‌సీ లింగారెడ్డి, సీఈలు వసంత్ నాయక్, ధర్మారెడ్డి, పలువురు ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఉన్నారు.

# జిందాల్ వర్సిటీలో లెక్చర్‌కు కేటీఆర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, ఆగస్ట్ 27**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు హర్యానాలోని ప్రముఖ ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ఆహ్వానం అందింది. విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషించడంతోపాటు వారిని ఉద్దేశించి 'డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్' ఇవ్వాలని యూనివర్సిటీ కేటీఆర్‌ను ఆహ్వానించింది. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సి. రాజ్ కుమార్ ఈ మేరకు కేటీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. కేటీఆర్ రాక, ఆయన ఆలోచనలు, ప్రసంగం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తి, ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు. కేటీఆర్‌కు అనుకూలమైన తేదీ, సమయాన్నిబట్టి సెప్టెంబర్, అక్టోబర్ 2026లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన భారత్‌లోనే తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమీని సందర్శించాలని కూడా కేటీఆర్‌ను ఆహ్వానించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లోనూ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ విశేష గుర్తింపు సాధించింది. గతంలో రాష్ట్రపతులు, ఉప రాష్ట్రపతులు, భారత ప్రధాన న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సహా పలువురు ప్రముఖులు జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

**హైదరాబాద్, ఆగస్ట్ 27:**

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలపై ఈనెల 29న అసెంబ్లీ కమిటీ హాల్ 1లో ఉదయం 11 గంటలకు ఎథిక్స్ కమిటీ భేటీ కానున్నది. కౌశిక్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై కమిటీ విచారించనున్నది. కాగా, ఎథిక్స్ కమిటీ పేరిట కాంగ్రెస్ సర్కార్ ప్రతిపక్షంపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బలిచేసేందుకు కుట్రలు చేస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నిండు శాసనసభలో బడిచే, పండబెట్టి తొక్కుతా, బట్టలూడదీసి కొడతా, మా దగ్గర కండలు తిరిగినోళ్లున్నరు.. బోర్ల వేసి కొడ్తం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, 'అరేయ్ తోలుతీస్తా, బయట తిరుగనివ్వను' అని దానం నాగేందర్, 'పది కత్తులు లేస్తే తలలు తెగుతయ్.. కత్తులతో కోలాటమాడతా' అని మందుల సామేల్ బెదిరింపులు, ఎమ్మెల్యే వీర్నపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ అసభ్య సైగలు ఎథిక్స్ కమిటీ కిందకు రావా అని సూటిగా ప్రశ్నించారు. వారు మాట్లాడిన మాటలు, చేసిన చేష్టల వీడియోలు చూపుతూ ధ్వజమెత్తారు. కౌశిక్‌రెడ్డి ప్రవర్తనపై చర్చించి చర్యల సిఫారసుకు ఈ నెల 29న ఎథిక్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసినట్టు నోటీసు వచ్చిందని, అయితే కౌశిక్ వ్యవహారాన్ని సిఫారసు చేసిన సమయంలో ఎథిక్స్ కమిటీ మనుగడలో లేదని తెలిపారు. అసలు కమిటీ లేనప్పుడు ఆ వ్యవహారాన్ని ఎలా రెఫర్ చేస్తారని ప్రశ్నించారు. దీన్నిబట్టి కక్ష సాధింపు చర్యగా అర్థమవుతుందన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కడియం అదే ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని కౌశిక్ ఆక్షేపించారని తెలిపారు.

# బంగారం, రాగి వెలికితీసి దేశ సంపద పెంచుదాం



గుర్తుచేశారు. పరిశీలన అనంతరం ఆయన మాట్లాడుతూ అన్వేషణ పనులను సింగరేణి సంస్థ త్వరలోనే వేగవంతం చేస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు విజయవంతమై ఇక్కడ బంగారం, రాగి విరివిగా లభిస్తే ప్రాంతీయంగా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభించడమే కాక ఈ ప్రాంతం శీఘ్రగతిన అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పనుల పర్యవేక్షణకు అధికారులు ఇక్కడే ఉండేలా సింగరేణి ఆధ్వర్యంలో త్వరలోనే ఒక సైట్ ఆఫీస్‌ను, అలాగే రాకపోకల సౌకర్యార్థం హెలిప్యాడ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించిన వెంటనే ఈ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. అలాగే, కృష్ణానదికి ఇరువైపులా ఉన్న తెలుగు, కర్ణాటక ప్రజల మధ్య విడదీయరాని చారిత్రక, సాంస్కృతిక బంధం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలోనే భాగమైనందున మన మూలాలు ఒక్కటేనని గుర్తుచేశారు. స్థానిక ప్రజల అండదండలతో ఈ ప్రాజెక్టును త్వరలోనే విజయవంతంగా పూర్తి చేసి దేశ సంపదను పెంచడానికి ఉపయోగపడదామని పిలుపునిచ్చారు. ఈ అన్వేషణ రెండు రాష్ట్రాల పురోగతికి, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎంతగానో దోహదపడుతుందని ఆకాంక్షించారు. దేవదుర్గ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని సింగరేణి సీఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్నారు. ఈ ప్రాంతంలో గతంలో సీఐగా పని చేశానని, ప్రస్తుతం సింగరేణి సంస్థ చైర్మన్, డైరెక్టర్‌గా ఇక్కడ బంగారం, రాగి గని పనులను స్థానికుల సమక్షంలో ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ పరమానంద స్వామి గుట్ట పరమానంద స్వామి ఆశీస్సులతో ఇక్కడ బంగారు నిక్షేపాలు లభించాలని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కలగాలని ఆకాంక్షించారు.

**ప్రపంచపటాలు పరిశీలించండి**

**భట్టికి ఘనస్వాగతం**

లింగదహళ్ళికి చేరుకున్న భట్టి విక్రమార్కకు రాయచూరు జిల్లా మేజిస్ట్రేట్, డిప్యూటీ కమిషనర్ పూవిత, కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు తనయుడు కాంగ్రెస్ నాయకుడు రవి బోసురాజు, స్థానిక సర్పంచ్ ఎల్లమ్మ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. లింగదహళ్ళిలోని దేవదుర్గ బంగారు ఖనిజ బ్లాక్ వ్యూ పాయింట్ నుంచి ఖనిజ అన్వేషణ చేపట్టనున్న ప్రాంతాలను ఉప ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడి బ్లాక్ నుంచి సింగరేణి అధికారులు సేకరించిన వివిధ రకాల ఖనిజ నమూనాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించబోయే బంగారం, రాగి వెలికితీత, అన్వేషణ ప్రక్రియల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరేణి అధికారులు, కర్ణాటక రాష్ట్ర అధికార యంత్రాంగంతో డిప్యూటీ సీఎం సమీక్షా సమావేశం నిర్వహించి ఖనిజ అన్వేషణపై దిశా నిర్దేశం చేశారు. లింగదహళ్ళిలోని చారిత్రక నేపథ్యం కలిగిన శ్రీ పరమానంద శివాలయాన్ని దర్శించుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ సీకే వెంకటేశ్వర్లు, జీఎం పంకజ్ కులశ్రేష్ఠ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు, సింగరేణి ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో భారీగా ధాన్యం సైలోలు

**హైదరాబాద్, ఆగస్టు 27:**



రాష్ట్రంలో ఏటేటా విస్తరిస్తున్న వరి సాగు, గణనీయంగా పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి, ప్రభుత్వ సేకరణ అవసరాలకు దీర్ఘకాలిక పరిష్కారంగా అత్యాధునిక ధాన్య సైలోల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర పౌర సరఫరాల సంస్థను ఆదేశించారు. రాష్ట్రంలో అదనంగా 5 లక్షల నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ ధాన్య నిల్వ సామర్థ్యాన్ని సృష్టించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ సైలోల నిర్మాణం, నిర్వహణలో మహిళా స్వయం సహాయక సంఘాలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు కొత్త మార్గాలను తెరవడంతోపాటు, రాష్ట్ర ఆహార భద్రతకు అవసరమైన శాశ్వత మౌలిక సదుపాయాల నిర్మాణంలో వారిని భాగస్వాములను చేసే నమూనాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. పౌర సరఫరాల సంస్థ కార్యకలాపాలపై సీనియర్ అధికారులతో మంత్రి ఉత్తమ్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి, సేకరణకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని విస్తరించాల్సిన అవసరాన్ని వివరించారు. మెరుగైన సాగునీటి సదుపాయాలు, సాగు విస్తీర్ణం పెరగడం, కనీస మద్దతు ధరకు ప్రభుత్వం ధాన్యం సేకరిస్తుండడంతో తెలంగాణలో వరి ఉత్పత్తితో పాటు ధాన్యం కొనుగోళ్లు కూడా ఏటేటా పెరుగుతున్నాయన్నారు. భవిష్యత్ అవసరాలను కేవలం సంప్రదాయ గోదాములతో తీర్చడం సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్, శాస్త్రీయ సంరక్షణ, యాంత్రిక రవాణా, డిజిటల్ పర్యవేక్షణ వంటి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలతో కూడిన నిల్వ నెట్‌వర్క్ అవసరమన్నారు. తేమ, పురుగులు, ఇతర నిల్వ సంబంధిత కారణాలతో ధాన్యం నష్టపోకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ధాన్యం నిల్వ నుంచి తరలింపు వరకు ప్రతి దశలో నాణ్యత, భద్రత, సామర్థ్యాన్ని పెంచే విధంగా సైలో వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామస్థాయి సంస్థలు, పౌర సరఫరాల సంస్థ భాగస్వామ్యంతో ఆధునిక సైలోల నిర్మాణం, నిర్వహణ చేపట్టేందుకు అనువైన నమూనాలను అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇందులో పౌర సరఫరాల సంస్థ, మహిళా సంఘాలు, ఇతర భాగస్వామ్య సంస్థల బాధ్యతలను స్పష్టంగా నిర్వచించాలని చెప్పారు. సైలోలు ఆర్థికంగా స్వయం సమర్థంగా, వృత్తిపరంగా నిర్వహించబడేలా తగిన ఆర్థిక, కార్యాచరణ నమూనాలను రూపొందించాలన్నారు. "రాష్ట్ర ధాన్య నిల్వ మౌలిక సదుపాయాలను కేవలం వచ్చే కొనుగోలు సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని కాదు.. రాబోయే దశాబ్దాల అవసరాలను ముందుగానే అంచనా వేసి నిర్మించాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పౌర సరఫరాల సంస్థ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, కేంద్ర గిడ్డంగుల సంస్థ, భారత ఆహార సంస్థ, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రైవేటు పెట్టుబడిదారుల గోదాముల ద్వారా ధాన్యం నిల్వ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు సొంతంగా సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ,ప్రతి సీజన్‌లో భారీగా సేకరిస్తున్న ధాన్యాన్ని నిల్వ చేసేందుకు ఇతర సంస్థలు, అద్దె గోదాములపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఇటీవలి ధాన్యం సేకరణ పరిమాణమే రాష్ట్ర నిల్వ వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిడిని తెలియజేస్తోందని మంత్రి చెప్పారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో పౌర సరఫరాల సంస్థ 90 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించేందుకు సిద్ధమైందని, సీజన్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా తక్షణమే సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. భారీ స్థాయిలో పెరుగుతున్న ధాన్యం సేకరణకు, అందుబాటులో ఉన్న శాశ్వత శాస్త్రీయ నిల్వ సామర్థ్యానికి మధ్య పెరుగుతున్న అంతరం కొత్త సైలోల నిర్మాణం ఎంత అత్యవసరమో స్పష్టం చేస్తోందన్నారు.

మిల్లర్ల బకాయిల వసూలుకు పటిష్ఠ వ్యూహం డిఫాల్టర్ కస్టమ్ రైస్ మిల్లర్ల నుంచి రావాల్సిన బకాయిల వసూలును వేగవంతం చేసేందుకు సమర్థవంతమైన కార్యాచరణ రూపొందించాలని మంత్రి పౌర సరఫరాల సంస్థను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలు, ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా బకాయిల వసూలు వ్యూహాన్ని సిద్ధం చేయాలని చెప్పారు. డిఫాల్టర్లపై చేపట్టే న్యాయపరమైన, విజిలెన్స్, పరిపాలనాపరమైన చర్యలన్నింటిలోనూ ప్రజాధనం తిరిగి రాబట్టడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం నిల్వల ప్రతిపాదిత వేలంపైనా మంత్రి సమీక్షించారు. తదుపరి విడత వేలం ప్రారంభించే ముందే లాట్ పరిమాణాలు, బిడ్డింగ్ నిబంధనలు, వేలం నిర్వహించే వేదికలను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. వేలం ప్రక్రియలో పారదర్శకత, ఏకరూపత, విస్తృత భాగస్వామ్యం ఉండేలా గవర్నమెంట్ ఈమార్కెట్‌ప్లేస్, ఈప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ వంటి గుర్తింపు పొందిన ప్రభుత్వ వేదికలను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తికి తగిన నిల్వ సామర్థ్యాన్ని సృష్టించడం ద్వారా రైతుల కష్టార్జిత పంటకు భద్రత కల్పించడంతోపాటు, ప్రజాధనాన్ని కాపాడటం, నిల్వ నష్టాలను తగ్గించడం, పౌర సరఫరాల వ్యవస్థను మరింత ఆధునికంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. సమావేశంలో పౌర సరఫరాల అదనపు సంచాలకుడు రోహిత్ సింగ్, పౌర సరఫరాల సంస్థ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



# ఈవీ పథకం కింద ఆటో డ్రైవర్లకు సాయం

- రూ.200 కోట్లు కేటాయిస్తూ జీవో జారీ

**హైదరాబాద్, ఆగస్ట్ 27,**

ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆటోరిక్షా డ్రైవర్లకు ప్రయోజనం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్2026'ను అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ పథకం అమలుకు సిఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రి ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం ఏకంగా రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. ఈ పథకం ద్వారా సంప్రదాయ ఇంధన వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోల వినియోగం పెరగనుంది. పెట్రోల్, డీజిల్ కోసం రోజూ అయ్యే ఖర్చుతో పోలిస్తే ఎలక్ట్రి వాహనాల నిర్వహణ వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో ఆటో డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరనుంది. రూ.200 కోట్ల నిధులతో 18,766 ఆటోలను ఇవిలుగా మార్చే పక్రియను ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాలి

- హరిత వాతావరణం ప్రోత్సహించడంలో భాగస్వాములు కావాలి
- 20వ గ్రాండ్ నర్సరీ మేళాను ప్రారంభించిన మంత్రి తుమ్మల
- ఐదు రోజులపాటు ఆల్ ఇండియా హార్టికల్చర్ అండ్ అగ్రికల్చర్ షో

**హైదరాబాద్, ఆగస్టు 27 :**

ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగర జీవనంలో పెరుగుతున్న ఒత్తిడి, కాలుష్యం నేపథ్యంలో హరిత వాతావరణాన్ని పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐమ్యాక్స్ థియేటర్ పక్కన హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 20వ గ్రాండ్ నర్సరీ మేళాఆల్ ఇండియా హార్టికల్చర్ అండ్ అగ్రికల్చర్ షోను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్‌స్‌ను పరిశీలించిన మంత్రి తుమ్మల మాట్లాడుతూ 2015 నుంచి ప్రతి ఏడాది జనవరి, ఆగస్టుల్లో క్రమం తప్పకుండా నర్సరీ మేళాను నిర్వహించడం అభినందనీయమని మంత్రి అన్నారు. ప్రజలకు వివిధ రకాల మొక్కలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఇంటి స్థాయిలో గార్డెనింగ్‌ను ప్రోత్సహించడానికి ఈ మేళా మంచి అవకాశంగా నిలుస్తుందని పేర్కొన్నారు. 31వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరగనున్న ఈ మేళాలో 110కిపైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ నర్సరీల నుంచి తీసుకొచ్చిన అనేక రకాల మొక్కలను ప్రజలకు అందుబాటులో ఉంచారు. టెర్రస్ గార్డెనింగ్, వెర్టికల్ గార్డెనింగ్, హైడ్రోపోనిక్ గార్డెనింగ్‌కు అవసరమైన మొక్కలతో పాటు పూల మొక్కలు, మెడిసినల్ ప్లాంట్స్, బోన్సాయి, అలంకరణ మొక్కలు వంటి విభిన్న రకాల మొక్కలు మేళాలో అందుబాటులో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్, కోల్‌కతాతోపాటు ఢిల్లీ, హర్యానా, గుజరాత్, ముంబయి, బెంగళూరు, పూణే, షిర్డీ, చెన్నై, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి మొక్కలను తీసుకొచ్చారు. నాగాలాండ్ నుంచి వచ్చిన కాక్టస్ వంటి ప్రత్యేక ఆకర్షణ కలిగిన మొక్కలు కూడా మేళాలో ఉన్నాయని వివరించారు. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా రూ.20 నుంచి రూ.2.5 లక్షల విలువైన మొక్కల వరకు వివిధ రకాల మొక్కలు మేళాలో లభిస్తున్నాయని మంత్రి తెలిపారు. మొక్కల పెంపకానికి అవసరమైన మెటీరియల్స్, ఆర్గానిక్ ఎరువులు, ఫెర్టిలైజర్లు, టెర్రకోట కుండీలు తదితర సామగ్రి కూడా ఒకేచోట లభించడం మేళా ప్రత్యేకతగా పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో లభించే అరుదైన, ప్రత్యేకమైన మొక్కలను హైదరాబాద్ నగర ప్రజలకు ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయమని మంత్రి తుమ్మల అన్నారు. మొక్కలు ఇంటి అందాన్ని పెంచడమేకాక ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయని తెలిపారు. మొక్కల పెంపకాన్ని అలవాటుగా చేసుకోవడం ద్వారా సమయాన్ని సృజనాత్మకంగా వినియోగించుకోవచ్చన్నారు. ఈ మేళా ద్వారా ప్రజలకు మొక్కలపై అవగాహన పెరగడంతోపాటు ఇంటి స్థాయిలో గార్డెనింగ్‌ను ప్రోత్సహించడానికి మంచి అవకాశం లభిస్తుందని మంత్రి అన్నారు. హైదరాబాద్ నగర వాసులందరూ ఈ ఐదు రోజుల నర్సరీ మేళాను సందర్శించి తమకు నచ్చిన మొక్కలను కొనుగోలు చేసి తమ ఇళ్లను మరింత పచ్చదనంతో నింపాలని కోరారు.

# మిర్ ఆలం చెరువుకు కొత్త సొబగులు

**హైదరాబాద్, ఆగస్టు 27 :**

చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువుకు ప్రభుత్వం కొత్త రూపు, సరి కొత్త హంగులు సమకూర్చాలని యోచిస్తోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి, వినోదం, విశ్రాంతిని ఆస్వాదించేలా దీనిని ప్రముఖ పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మిర్ ఆలం చెరువును ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం అకస్మికంగా పరిశీలించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. చెరువు చుట్టూ జరుగుతున్న పనులు, చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఫొటో ప్రదర్శన ద్వారా పనుల పురోగతిని సీఎంకు అధికారులు వివరించారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. చెరువు పునరుజ్జీవం, చెరువు పరిసర ప్రాంతాలు, అందులోని ఐలాండ్ల అభివృద్ధి, చెరువుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం.. ఈ మూడు ప్రధాన అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అయితే, మిర్ ఆలం చెరువులోకి మురుగు నీరు చేరకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవంతోపాటు నీటి నాణ్యతను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.



**వాటర్ స్పోర్ట్స్‌కు డిజైన్**

మిర్ ఆలం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. అవసరమైన సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, అడ్వెంచర్ కార్యకలాపాలకు అవకాశాలను పరిశీలించాలన్నారు. దీంతో యువతతోపాటు కుటుంబాలకు కూడా ఆకర్షణీయమైన వినోద కేంద్రంగా మిర్ ఆలం మారుతుందని అభిప్రాయపడ్డారు. చెరువు చుట్టూరా ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వినోద, కార్యకలాపాల కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. పాదచారులకు అనుకూలంగా వాకింగ్, పబ్లిక్ స్పేస్‌లను తీర్చిదిద్దడంతోపాటు రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరచనున్నట్లు□ యన తెలిపారు.

**ఐలాండ్లకూ కొత్త రూపు**

మిర్ ఆలం చెరువులో ఉన్న ఐలాండ్లను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్ (టెంట్లు వేయడం), ఇతర పర్యాటక కార్యకలాపాలకు ఈ ప్రాంతాన్ని వినియోగించుకునే అవకాశాలను అధికారులను పరిశీలించాలని చెప్పారు. వెడ్డింగ్, ఈవెంట్ డెస్టినేషన్ల ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల అభివృద్ధిలో పీపీపీ విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు.

**జూ పార్కుతో సమగ్ర పర్యాటక అనుసంధానం**

సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని అనుసంధానం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూ సందర్శన, ప్రకృతి, చెరువు అందాలు, కుటుంబ వినోదం అన్నీ ఒకే పర్యాటక అనుభవంగా అందించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ట్యాంక్ పునరుజ్జీవం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్నదన్నారు.

**సస్పెన్షన్ బ్రిడ్జి పనుల్లో 50 శాతం పురోగతి**

మిర్ ఆలం ట్యాంక్‌పై నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. నేటితో లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 పూర్తయ్యాయి. అంటే 50.18 శాతం పనులు పూర్తయ్యాయి. 62 పైల్ క్యాప్స్‌లో 28 పూర్తికాగా, 45.16 శాతం పురోగతి నమోదైంది. 62 పియర్‌కమ్‌పియర్ క్యాప్స్‌లో ఇప్పటివరకు ఆరు పూర్తయ్యాయి. విమానాశ్రయానికి సమీపంలో ఉన్న మిర్ ఆలం చెరువును పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. చారిత్రక చెరువు, పచ్చని పరిసరాలు, నెహ్రూ జూ పార్కు సమీపం, ఐలాండ్లు, వాటర్ స్పోర్ట్స్, కుటుంబ వినోదం, ఫుడ్‌కోర్టులు, ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జితో మిర్ ఆలం ట్యాంక్‌కు రికొత్త గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అభివృద్ధి పూర్తయితే నగరవాసులతోపాటు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే ప్రముఖ పర్యాటక కేంద్రంగా మిర్ ఆలం ట్యాంక్ మారనుంది.

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

సెంటర్ వద్ద ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతులను బొంతా బాబు, బొంతా మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మమ్మ, గంగమ్మ, మరియమ్మ, చౌటుపల్లి సువార్తగా గుర్తించారు. కాగా, బాధితులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా పోలీసులు తెలిపారు. వీరంతా ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హాస్పిటల్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్య కుమార్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతిచెందడం, పలువురు గాయపడటంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. 'చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్లొస్తూ ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. ప్రమాదంపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పల్నాడు జిల్లా అదనపు ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బస్సు వేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం సహా అన్ని కోణాల్లో విచారణ చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయసహకారాలు అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రైవేటు ట్రావెల్స్ రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు అనిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతిచెందడంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి చెందారు. అధికారుల నుంచి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. ప్రమాదంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని శ్రీనివాసరావు ఆకాంక్షించారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. ప్రమాద ఘటనపై పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. చిలకలూరిపేట పట్టణంలో ఇంత పెద్ద ప్రమాదం ఎప్పుడూ జరగలేదని.. ప్రమాదంలో ఏడుగురు చనిపోవడం తనను కలచి వేసిందన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి హామీ ఇచ్చారు.

# ఏఐసీసీ పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

**నిజామాబాద్, ఆగస్టు 27**

మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందని, క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపినట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కొండా సురేఖ అంశం కాంగ్రెస్ లో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సురేఖ కూతురు సుష్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం, దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా కుమార్తె వ్యాఖ్యలకుతనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందని, అయితే అది క్రమశిక్షణకు లోబడి ఉండాలని ఆయన అన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే స్వేచ్ఛ ఎక్కువన్నారు. పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని, కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. ఇక తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు 'సర్' నోటీసు అందిందని, వివరాలు సమర్పిస్తానని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు.



# ట్రాఫిక్, రోడ్ సేఫ్టీపై కార్యాచరణ రూపొందించాలి

**మొదటిపేజీ తరువాయి**

ప్రణాళికను సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సచివాలయంలో ఉన్నతాధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ సిగ్నళ్ల నిర్వహణ, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, అత్యవసర సేవలకు వేగవంతమైన మార్గాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలు, జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీలు, పట్టణ ప్రాంతాలు, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు మున్సిపల్, పోలీస్, రవాణా తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. నవంబర్, డిసెంబర్ నాటికి అవసరమైన ప్రాంతాల్లో సిగ్నలింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**శాఖల మధ్య సమన్వయం**

నార్కోటిక్ బ్యూరో, టీజీసేఫ్ తరహాలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత కోసం ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ (టీజీటీఎంఎ ఆర్ఎస్) పేరుతో ప్రత్యేక, స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎస్ సూచించారు. సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకరించడంతోపాటు ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత పటిష్ఠం చేయాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం 429 ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థలు ఉన్నాయని, వీటిలో అధునాతన సిగ్నల్ నియంత్రణ వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు. ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత ఒకే శాఖకు పరిమితమైన అంశాలు కావని, పోలీస్, రవాణా, రోడ్లుభవనాలు, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సీఎస్ పేర్కొన్నారు. ప్రతి ప్రాంతానికి సంబంధించిన ట్రాఫిక్ డేటాను సమీకరించి ఒకే వేదికపై విశ్లేషించేందుకు ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ డేటా ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా, సురక్షితంగా మార్చేందుకు కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎస్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కేవలం ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించడానికే పరిమితంకాక ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేలా ఉండాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారాలను గుర్తించేందుకు డేటా ఆధారిత, సాంకేతికత ఆధారిత, ప్రజా ప్రయోజనకరమైన విధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏఐ ఆధారిత ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతకు సంబంధించి అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యయనం చేసి అవసరమైన ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టులను చేపట్టాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టుల ఫలితాల ఆధారంగా వాటిని దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో డీజీపీ సి.వి.ఆనంద్, రవాణా, రోడ్లుభవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అక్కచెల్లెళ్లకు సీఎం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 27 :**

రాఖీ పౌర్ణమి పండగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అక్కచెల్లెళ్ళలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక అయిన ఈ పండగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం వెల్లివిరియాలని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే బృహత్ సంకల్పంలో భాగంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని సీఎం తెలిపారు.



# తుమ్మిడిహట్టిపై 1న కీలక సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 27** ప్రాణహితపై తెలంగాణ ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సేవా భవన్‌లో జరిగే ఈ సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేసిన నిరంతర ప్రయత్నాల నేపథ్యంలో కేంద్ర జల సంఘం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. తుమ్మిడిహట్టిని ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసి రెండు రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేసి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం సూచించాలని కోరారు. ఈ అంశాన్ని ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లగా ప్రధాని కార్యాలయం జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించింది. అనంతరం ఆగస్టు 5న కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు సీఎం ప్రత్యేకంగా లేఖ రాసి కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. మహారాష్ట్ర గతంలో అంగీకరించిన 148 మీటర్ల ఎత్తుకు బదులుగా 152 మీటర్ల ఎత్తు ఉండేలా అంగీకారం సాధించేందుకు తెలంగాణ ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల వద్ద అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తీసుకోవడం సాధ్యం కాదని, భారీ పంపులు వినియోగిస్తే విద్యుత్ వ్యయం పెరుగుతుందని కేంద్రానికి వివరించింది. తక్కువ విద్యుత్ వ్యయంతో, దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగేలా ప్రాజెక్టును నిర్మించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన వాదన. సీడబ్ల్యూపీఆరఎస్ అధ్యయనాల ప్రకారం జలమట్టం పెంపుతో అదనపు ముంపు పరిమితంగానే ఉంటుందని కూడా ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. వెనుకబడిన, కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించే ఈ కీలక ప్రాజెక్టును త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం, మహారాష్ట్రలతో సంప్రదింపులు కొనసాగిస్తోంది.



# మైనింగ్ ఏడీ జయరాజు ఇళ్లపై ఏసీబీ దాడులు

- **భారీగా నగదు, నగలు స్వాధీనం**

**హైదరాబాద్,ఆగస్ట్ 27 :**

భాగ్యనగరంలో మరోసారి ఏసీబీ సోదాలు కలకలం రేపుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భ గనుల శాఖ ఏడీ జయరాజు ఇళ్లలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. గురువారం తెల్లవారుజాము నుంచే సోదాలు మొదలయ్యాయి. భూపాలపల్లితోపాటు హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు ప్రాంతాల్లోని 8 చోట్ల అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో దాడులు కొనసాగుతున్నాయి. జయరాజ్ ఇంట్లో లక్షన్నర నగదు, బంగారు ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్, ల్యాండ్ డాక్యుమెంట్లను గుర్తించి పరిశీలిస్తున్నారు. బ్యాంకులో రూ.60 లక్షల నగదు ఏసీబీ అధికారులు గుర్తించారు. అలాగే రెండు కార్లు, రెండు బైక్‌లు, జనగామలో ఐదు ఎకరాల భూమి ఏసీబీ అధికారుల తనిఖీల్లో బయటపడింది. సోదాలపై ఏబీసీ జాయింట్ డైరెక్టర్ సాయిమనోహర్ మాట్లాడుతూ భూగర్భ జల గనుల శాఖ ఏడీ జయరాజు నివాసంతోపాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఉదయం నుంచి జరుగుతున్న సోదాల్లో 40తులాల బంగారాన్ని గుర్తించామన్నారు. ఇంట్లో లక్షన్నర నగదుతోపాటు ఆయన బ్యాంకు ఖాతాలో నగదును కూడా గుర్తించామని తెలిపారు. జనగామలో ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ఆయనపై ఏసీబీకి అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. హైదరాబాద్‌లోనే నాలుగుచోట్ల సోదాలు కొనసాగుతున్నాయని సాయిమనోహర్ తెలిపారు. తాండూరు, వరంగల్‌లోని జయరాజ్ సన్నిహితులు, బంధువుల ఇళ్లల్లో కూడా సోదాలు జరుగుతున్నాయన్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్‌తోపాటు రెండు కార్లు, రెండు బైక్‌లను కూడా గుర్తించామన్నారు. సోదాల అనంతరం ఆయన అక్రమాస్తులపై స్పష్టత వస్తుందని చెప్పారు. జయరాజ్ ఇటీవలే స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. ములుగు, భూపాలపల్లి జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న కొందరితో జయరాజ్ కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు గతంలో అనేకసార్లు వెల్లువెత్తాయి.

# 48వ డివిజన్‌లో ఎస్ఐఆర్–IIపై వార్డు సభ

## మన ఓటు.. మన హక్కు'పై ప్రజలకు అవగాహన కల్పించిన కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 27 (డీడీ9 వార్త):**

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు 48వ డివిజన్‌లో ఎస్ఐఆర్–II సవరణపై ప్రత్యేక వార్డు సభ నిర్వహించారు. కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్త ఓట్ల నమోదు, షిఫ్టెడ్ ఓట్లు, అభ్యంతరాల స్వీకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కార్పొరేటర్ కోరారు. ఎమ్మెల్యే, మేయర్ మహంకాళి స్వామి, మున్సిపల్ సిబ్బంది, బీఎల్‌ఓలు, బీఎల్ఏలు, ఆర్‌పీలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలి

## ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం.. బీజేవైఎం నిరసన



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 27 (డీడీ9 వార్త):**

విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రామగుండం బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ రాష్ట్ర బీజేవైఎం పిలుపు మేరకు చేపట్టిన 'ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి' కార్యక్రమంలో భాగంగా మార్కండేయ కాలనీలోని జ్యోతిబాపూలే విగ్రహం వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం చేయడం వల్ల విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు బూడిద హర్ష, శిలారపు కళ్యాణ్, సాయికుమార్, రవితేజ, రాహుల్, అంజి, లడ్డు, బన్నీ తదితరులతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షా కాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..

## వెంకటాపురం మండలంలో విస్తృత హెల్త్ క్యాంపులు..



**ఆగస్టు27 డిడి9 వార్త వెంకటాపురం.**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సూచించారు. గురువారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, సబ్‌సెంటర్ల పరిధిలోని గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించారు.క్యాంపుల్లో ప్రజలకు మధుమేహం, రక్తపోటు తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి నెలవారీ మందులను అందజేశారు. వర్షాకాలంలో సాధారణంగా వచ్చే జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్, విరేచనాలు వంటి వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని, కాచి చల్లార్చిన లేదా సురక్షితమైన నీటినే తాగాలని సూచించారు. భోజనం ముందు, తర్వాత మరియు మరుగుదొడ్డి వినియోగం అనంతరం సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. ప్రత్యేకంగా బోధపురం గ్రామపంచాయతీ పరిధిలోని సీతారాంపురం గ్రామంలో ఇంటింటి మలేరియా సర్వే నిర్వహించడంతో పాటు హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, నాయకులు, ఏదిరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయుడు సత్యనారాయణ, అంగన్వాడీ టీచర్ వెంకటలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు. "సబ్బుతో చేతులు కడుక్కుందాం – జబ్బులకు దూరంగా ఉందాం" అంటూ వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు.

# ఓ సి పి –3 ఎస్ &డి సెక్షన్‌లో ఉద్రిక్తత

- మేన్‌వే క్లర్క్ దురహంకార వైఖరిపై కార్మికుల నిరసన ధర్నా.

**డిడి9వార్త / రామగుండం ఆగష్టు 27:**



ఈ రోజు సింగరేణి (ఓ సి పి –3): పరిధిలోని ఎస్ & డి సెక్షన్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ &డి మేన్‌వే క్లర్క్, కార్మికుల పట్ల అత్యంత దురుసుగా ప్రవర్తిస్తూ, అసభ్యకర పదజాలంతో మాట్లాడటంతో ఆగ్రహించిన కార్మికులు భారీ నిరసన ధర్నా చేపట్టారు. సమాచారం ప్రకారం, సదరు మేన్‌వే క్లర్క్ గత ఏడు సంవత్సరాలుగా ఇక్కడే తిష్టవేసి, అధికారుల అండదండలతో కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇతని వైఖరి నచ్చక 200 నుండి 300 మంది కార్మికులు ఇతను ఇక్కడ వద్దని స్పష్టంగా చెప్పి బదిలీ చేయించినప్పటికీ, అధికారుల బలాన్ని, తన పలుకుబడిని ఉపయోగించి మళ్లీ వెంటనే ఇదే సెక్షన్‌కు రావడం జరిగింది. గత 7 ఏళ్లుగా అతడిని ఇక్కడి నుండి పూర్తిగా తొలగించాలని యాజమాన్యానికి మొరపెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అతడు ప్రతినిత్యం సైకోలా ప్రవర్తిస్తూ, హద్దుమీరి మాట్లాడటంతో సహనం నశించిన కార్మికులంతా ఒక్కటై ధర్నాకు దిగారు.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు:**

కార్మికుల పట్ల అనాగరికంగా ప్రవర్తిస్తూ, అధికారుల బలంతో 7 ఏళ్లుగా ఏకఛత్రాధిపత్యం చెలాయిస్తున్న మేన్‌వే క్లర్క్‌ను వెంటనే ఓ సి పి –3 ఎస్ &డి సెక్షన్ నుండి శాశ్వతంగా బదిలీ చేయాలి.

★ గతంలో 200–500 మంది కార్మికులు వద్దని చెప్పి బదిలీ చేయించినా, మళ్లీ అధికారుల అండతో అదే సెక్షన్‌కు రావడంపై విచారణ జరిపి, క్లర్క్‌పై తక్షణమే శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

★పనిప్రాంతంలో కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించే అధికారుల వైఖరిని సహించేది లేదు.

ఈ నిరసన కార్యక్రమంలో ఎస్ &డి,సెక్షన్ కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని, యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే స్పందించి మేన్‌వే క్లర్క్‌ను ఇక్కడి నుండి తొలగించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# నల్ల వజ్రం' పురస్కారంతో మల్లెపల్లి లక్ష్మయ్యకు సత్కారం

- తెలంగాణ ఉద్యమానికి చేసిన సేవలు, జర్నలిజంలో విశేష కృషికి గుర్తింపు

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 27 (డీడీ9 వార్త):**

సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ బుద్ధవనం ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్యను 'నల్ల వజ్రం' పురస్కారంతో ఘనంగా సత్కరించారు. లక్ష్మయ్య–జయమ్మ దంపతులకు తారా ఆర్ట్స్ అకాడమీ గౌరవ సలహాదారు, ఇష్టా జాతీయ సమితి సభ్యుడు కే. స్వామి గురువారం గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీలో ఈ పురస్కారాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కే. స్వామి మాట్లాడుతూ.. జనగామలోని మధ్యతరగతి సింగరేణి కార్మిక కుటుంబంలో జన్మించిన మల్లెపల్లి లక్ష్మయ్య జర్నలిస్టుగా, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ బుద్ధవనం ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్‌గా కొనసాగుతూ సేవలందించడం గోదావరిఖనితో పాటు కోల్‌బెల్ట్ ప్రాంతానికే గర్వకారణమన్నారు. అంతర్జాతీయ కళాకారుడు, హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతున్న తారా ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంకె రాజేష్, అకాడమీ గౌరవ సలహాదారులు, సెలెక్షన్ కమిటీ సభ్యులు లక్ష్మయ్య ప్రతిభను గుర్తించి 'నల్ల వజ్రం' పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. పురస్కార ప్రదానోత్సవం రోజున బుద్ధవనం ప్రాజెక్టు పనుల్లో ఉండటంతో లక్ష్మయ్య హాజరు కాలేకపోయారని, దీంతో గురువారం ఆయనకు పురస్కారాన్ని అందజేసినట్లు స్వామి వివరించారు. పురస్కార గ్రహీత మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ..



ఇప్పటివరకు ఎన్నో పురస్కారాలు అందుకున్నప్పటికీ తాను పుట్టి పెరిగిన గడ్డపై 'నల్ల వజ్రం' పురస్కారం అందుకోవడం ప్రత్యేక ఆనందాన్ని కలిగించిందన్నారు. తనను పురస్కారానికి ఎంపిక చేసిన సెలెక్షన్ కమిటీ సభ్యులకు, పురస్కారాన్ని అందజేసిన కే. స్వామికి, తారా ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు సంకె రాజేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పురస్కార ఎంపిక కమిటీ సభ్యులు మేజిక్ రాజా, చంద్రపాల్, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు పులి మోహన్, రాధ, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి శ్రీకారం

- రూ.15 కోట్లతో పునర్నిర్మాణం.. భక్తులకు 22 వసతి గృహాల నిర్మాణం

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 26 (డీడీ9 వార్త):**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఓదెల మల్లికార్జున స్వామి దేవస్థానాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ స్థపతితో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం దాతల సహకారంతో నిర్మించనున్న 22 భక్తుల వసతి గృహాల సముదాయానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అంతకుముందు మల్లికార్జున స్వామి ఆలయంలో విజయరమణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ.. ఆలయ పరిసరాల్లో ఇప్పటికే రూ.1.30 కోట్లతో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి సుమారు రూ.15 కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. దేవాదాయ శాఖ స్థపతితో కలిసి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి పునర్నిర్మాణ పనులకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు.

ఆలయానికి నూతన గోపురాలు, రాతి శిల్పాలతో ప్రాకారం నిర్మించి మరింత సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. పర్యాటక శాఖ నుంచి మరో రూ.8 కోట్ల



అభివృద్ధి నిధులు మంజూరు కానున్నాయని వెల్లడించారు. రానున్న రోజుల్లో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్ తెలిపారు. ఆలయాన్ని దశలవారీగా అభివృద్ధి చేసి ప్రముఖ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, స్థానిక గ్రామ సర్పంచ్, ఈఓ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పలువురు గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 78 ఏళ్లుగా మాదిగలకు అన్యాయమేనా!!!

- ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఒక కుటుంబానికేనా!.. ఈ పద్ధతి మారాలి: కట్కూరి సందీప్

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 27 (డీడీ9 వార్త):**



పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో గత 78 ఏళ్లుగా ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లను ఒకే కుటుంబానికి కట్టబెడుతూ మాదిగలకు రాజకీయ పార్టీలు అన్యాయం చేస్తున్నాయని కట్కూరి సందీప్ ఆరోపించారు. ఇకనైనా ఈ విధానానికి స్వస్తి పలకాలని, లేకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు శక్తితో రాజకీయ పార్టీలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీల్లో డబ్బు ప్రభావం పెరిగిపోయిందని, కోట్ల రూపాయలు ఖర్చు చేసే వారికే టికెట్లు దక్కుతున్నాయని విమర్శించారు. ప్రజల కోసం పోరాడే నాయకులకు మాత్రం అవకాశాలు దక్కడం లేదన్నారు. ప్రజా సమస్యలపై పోరాటమే తన లక్ష్యమని, ప్రజల పక్షాన నిలబడటమే తన రాజకీయ ధ్యేయమని స్పష్టం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తున్నానని కట్కూరి సందీప్ తెలిపారు. సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వాస్తవాలు మరింత చేరువవుతున్నాయని అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ ప్రజలే నాకు దేవుళ్లు. ప్రజలను నమ్ముకుని వారి సమస్యల కోసం పోరాడుతున్నాను. ఒక్కసారి కష్టపడే నాయకుడి గురించి ఆలోచించండి అని కోరారు. ఎన్నికల్లో డబ్బు, కుటుంబ వారసత్వ రాజకీయాలకు కాకుండా ప్రజల కోసం పనిచేసే వ్యక్తులకు అవకాశం కల్పించాలని అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్‌లోని అన్ని వర్గాల ప్రజలు తనకు అండగా నిలిచి ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు గతంలో మాదిరిగా కాకుండా రాజకీయాలపై క్రమంగా అవగాహన పెంచుకుంటున్నారని సందీప్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోని పార్టీలకు రాబోయే ఎన్నికల్లో ఓటుతోనే సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రథమ కర్తవ్యం. పదవుల కోసం కాదు.. ప్రజల కోసం పోరాడుతున్నాను. ఈసారి కష్టపడే వారికి అవకాశం ఇవ్వండి అని కట్కూరి సందీప్ కోరారు.

# 49వ డివిజన్‌లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

- ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు.. కార్పొరేటర్ సాగి సంతోష్‌రావు

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 27 (డీడీ9 వార్త):**









రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 49వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఆదేశాల మేరకు, నగర మేయర్ మహంకాళి స్వామి సహకారంతో కార్పొరేటర్ సాగి సంతోష్‌రావు ఆధ్వర్యంలో డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. బ్లేడ్ ట్రాక్టర్, బేబీ ట్రాక్టర్ సహాయంతో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. వర్షాకాలం నేపథ్యంలో మురుగునీరు నిల్వ ఉండకుండా కాలువలు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సాగి సంతోష్‌రావు మాట్లాడుతూ... వర్షాకాలంలో పారిశుద్ధ్య లోపాల కారణంగా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా డివిజన్‌లో పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. డివిజన్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో అవసరమైన పారిశుద్ధ్య చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని కార్పొరేటర్ సాగి సంతోష్‌రావు స్పష్టం చేశారు.

## బిఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.



**మణుగూరు.ఆగస్టు 27(డి డి 9వార్త)**

ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు, సొసైటీ చైర్మన్ కుర్రీ నాగేశ్వరరావును ఏరియా టిబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిగేల నాగేశ్వర రావు, సుద్దాల సంపత్ కుమార్,, బద్దుల ప్రవీణ్ కుమార్ పి కె నాగరాజు,బీరయ్య, కటారి ప్రసాద్, కళ్యాన్ కుమార్, అజ్మీరా అశోక్ కుమార్, తోట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# కేఆర్‌సీ కాలనీలో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ

- గోరింటాకు వేడుకల్లో సందడి.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 27 (డీడీ9 వార్త):**





రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 48వ డివిజన్ పరిధిలోని కేఆర్‌సీ కాలనీలో గురువారం ఇందిరమ్మ చీరల పంపిణీ, గోరింటాకు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. 48వ డివిజన్ కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మక్కాన్ రాజ్ ఠాగూర్ సేవా సమితి చైర్మన్ మనాలి రాజ్ ఠాగూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి, గోరింటాకు వేడుకలను నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటూ సందడి చేశారు. కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్య అతిథి మనాలి రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం, ఆత్మగౌరవం కోసం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. పండుగల సందర్భంగా మహిళలకు చీరలు అందించడంతో పాటు, గోరింటాకు వేడుకలు నిర్వహించడం ద్వారా వారిలో ఆనందాన్ని, ఆత్మీయతను పెంపొందించవచ్చని పేర్కొన్నారు. 48వ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతిని అభినందించారు. కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి మాట్లాడుతూ.. డివిజన్ ప్రజల భాగస్వామ్యంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ చీరల పంపిణీతో పాటు గోరింటాకు వేడుకలు నిర్వహించడంతో మహిళలు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. కార్యక్రమానికి డివిజన్ ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో సందడి నెలకొంది.

## బంజారాల సంస్కృతి సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీక

### తీజ్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన బాడిశ నారమేష్



**గోవిందరావుపేట, డిడి 9 వార్త**

మండలంలోని బాలాజీనగర్ గ్రామంలో బంజారా సంప్రదాయాల నడుమ తీజ్ పండుగను గిరిజన ఆడపడుచులు, కుల పెద్దల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో ప్రతి ఏటా నిర్వహించే ఈ పండుగ బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. తొమ్మిది రోజుల పాటు ఆడపడుచులు నియమ నిష్ఠలతో గోధుమ మొలకలకు పూజలు నిర్వహించగా, చివరి రోజున సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేసి తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. కుల పెద్దల ఆహ్వానం మేరకు శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బాడిశ నాగరమేష్ వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుల పెద్దలు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బంజారా ఆడపడుచులకు నాగరమేష్ తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు లకావత్ నర్సింహ నాయక్, జిల్లా నాయకులు మంచెర్ల నాగేశ్వర్‌రావు, మాటూరి ఏడుకొండలు, కుల పెద్దలు భూక్య స్వామి నాయక్, మీటు నాయక్, సర్పంచ్ మాలోత్ గాంధీ, ఉపసర్పంచ్ అజ్మీరా శాంత నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ రైతు గుమ్మడి లింగన్న

- నివాళులర్పించిన ప్రముఖులు
- లింగన్న మృతి రైతులకు తీరనిలోటు
- వరంగల్ కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ సుధాకర్
- ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ గజ్జల శ్యాంసుందర్

**ములుగు, డీ డీ 9 వార్త :**



ఆదర్శ రైతు గుమ్మడి లింగన్న మరణం తీరని లోటు అని ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ గజ్జల శ్యాంసుందర్, వరంగల్ 33వ డివిజన్ కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ సుధాకర్ అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం అడవి రంగాపూర్ గ్రామానికి చెందిన గుమ్మడి లింగయ్య ఆదర్శ రైతు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, గురువారం పలువురు ప్రముఖులు గ్రామానికి చేరుకొని లింగయ్య చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవం తీసుకువచ్చిన ఆదర్శ రైతుగా గుమ్మడి లింగయ్య పేరు కీర్తి సంపాదించాడని, తెలిపారు. పత్తి, మిర్చి, మొక్కజొన్న, ఆధునిక వ్యవసాయ, పామ్ ఆయిల్ తదితర పంటలను డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు చేసి పలువురికి ఆదర్శప్రాయుడయ్యాడని వారు పేర్కొన్నారు. ఆయనకు భార్య, కుమారుడు గుమ్మడి తిరుమల్, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కలం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ సర్వర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి పెండ్యాల సత్యేంద్రం, కలాం ఫౌండేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నల్లబెల్లి సాంబయ్య పటేల్, ఆదర్శ ఉపాధ్యాయులు, సూత్రాల రవి, నాయకులు ముష్కమల్ల సాంబయ్య, వరంగల్ నాయకులు సంతోష్, సిరంగి వెంకన్న, మాజీ సర్పంచ్ గుమ్మడి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## 49వ డివిజన్ లో ఎస్ ఐఆర్ –2పై వార్డు సభ

- ఎస్ ఐఆర్ –2 వార్డు సభలో ప్రజలకు వివరించిన కార్పొరేటర్ సాగి సంతోష్ రావు
- మన ఓటు.. మన హక్కు'పై ప్రజలకు అవగాహన




**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 27 (డీడీ9 వార్త):**

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు 49వ డివిజన్‌లో ఎస్ఐఆర్–2 సవరణపై ప్రత్యేక వార్డు సభ నిర్వహించారు. నారాయణ స్కూల్ ప్రాంగణంలో కార్పొరేటర్ సాగి సంతోష్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్త ఓట్ల నమోదు, షిఫ్టెడ్ ఓట్లు, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సాగి సంతోష్‌రావు మాట్లాడుతూ.. 'మన ఓటు.. మన హక్కు' అనే స్ఫూర్తితో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ అజయ్‌కుమార్, బీఎల్‌ఓలు వనజ, రజిత, బీఎల్ఏలు సాగర్‌రెడ్డి, అల్లంకి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల భద్రతే లక్ష్యం అప్రమత్తతే ఆయుధం..

- బాలికల భద్రతకు కాఫెడ్ అండ – స్వీయ రక్షణపై శిక్షణ..

**ఆగస్టు27 డిడి9 వార్త వెంకటాపురం.**




బాలికల హక్కుల పరిరక్షణ, భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు వారిలో ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వెంకటాపురం మండలంలోని కస్తూర్బా బాలికల హాస్టల్‌లో ప్రత్యేక అవగాహన, యోగా, స్వీయ రక్షణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్ పి. సూర్యనారాయణ, కస్తూర్బా పీటీ కె. శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ బాలికలు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేలా వారిని చైతన్యపరచడం సమాజం బాధ్యత అన్నారు. బాలల హక్కులు, విద్యా హక్కు, సమానత్వం, బాల్య వివాహాల నివారణ, రక్షణ హక్కులు, సురక్షిత వాతావరణంపై అవగాహన కల్పించారు. పీటీ కె. శైలజ బాలికలకు యోగా శిక్షణ అందిస్తూ యోగా ద్వారా శారీరక ఆరోగ్యం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని వివరించారు. కరాటే బ్లాక్ బెల్ట్ 5వ డాన్ జి. హనుమంత్ బాలికలకు కరాటే, స్వీయ రక్షణలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రమాదకర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండటం, అవసరమైన సమయంలో తమను తాము రక్షించుకోవడం వంటి అంశాలను ప్రాక్టికల్‌గా నేర్పించారు. "కేర్ అండ్ షేర్" భావనతో బాలికలు పరస్పరం గౌరవించుకోవడం, సమస్యలను పంచుకోవడం, ఒకరికొకరు అండగా నిలవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బాలికల భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. భయపడకుండా ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా బాలికలను తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటాపురం మండల కోఆర్డినేటర్ జి. హనుమంత్, యానిమేటర్లు ఉష, ఇందిర, పద్మ, ప్రశాంత్, నరేశ్, కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి

**బోనకల్,ఆగస్టు 27,(డీడీ9 వార్త):**

చింతకాని మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామ మాజీ సర్పంచ్ కాంద్ర పిచ్చయ్య కుమార్తె వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలస్యం బసవయ్య, మండల టీడీపీ అధ్యక్షులు తేలుకుంట్ల శ్రీనివాసరావు, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య, సీనియర్ బీజేపీ నాయకులు మద్దినేని వెంకటేశ్వరరావు, కిలారి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం..



ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.



**మణుగూరు.ఆగస్టు 27 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఇరిగేషన్ మరియు వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన సభాస్థలి, డెలివరీ పాయింట్, హెలిప్యాడ్ ప్రాంతాలను తనిఖీ చేశారు. గొందిగూడెంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభా ప్రాంగణాన్ని పరిశీలించి, హాజరయ్యే ప్రజలు, నాయకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు పకడ్బందీగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం డెలివరీ పాయింట్ వద్ద జరుగుతున్న పనుల పురోగతిని ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకుని, ప్రారంభోత్సవానికి పనులను వేగవంతం చేయాలని సూచించారు. మంత్రుల రాక కోసం మారెళ్లపాడులో సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్ పనులను పరిశీలించి, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రుల పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించి, మార్గమధ్యంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు మరియు అధికారులను కోరారు. మంత్రుల పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో బ్యాంకింగ్ ఉద్యోగుల నిరసన

### యూఎఫ్ బీయూ పిలుపుతో ఐదు రోజుల ఆందోళన..

### పాల్గొన్న 50 మంది ఉద్యోగులు




**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 27 (డీడీ9 వార్త):**

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు గోదావరిఖనిలో నిర్వహించిన ఐదు రోజుల బ్యాంకింగ్ నిరసన కార్యక్రమం విజయవంతమైంది. పెద్దపల్లి కోఆర్డినేషన్ కమిటీ–గోదావరిఖని ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది బ్యాంకు ఉద్యోగులు, కామ్రేడ్స్ ఉత్సాహంగా పాల్గొని తమ ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం తమ హక్కు అని, పీఎల్ఐలో ఉన్న వివక్షను తొలగించాలని, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పోరాడుతామని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యూనియన్ల పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఉద్యోగికి పెద్దపల్లి కోఆర్డినేషన్ కమిటీ–గోదావరిఖని కార్యదర్శి కె. ఉదయ్‌కుమార్ హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

## పద్మావతి కాలనీలో రక్షాబంధన్ వేడుకలు

### సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా ఘనంగా నిర్వహణ



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 27 (డీడీ9 వార్త):**

పద్మావతి కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి 49వ డివిజన్ కార్పొరేటర్ సాగి సంతోష్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా రక్షాబంధన్ పండుగ సోదర–సోదరీమణుల ప్రేమాభిమానాలకు, పరస్పర రక్షణకు ప్రతీక అని పలువురు పేర్కొన్నారు. కాలనీ వాసులు కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారులు ఉత్సాహంగా రాఖీలు కట్టుకుంటూ సందడి చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవికుమార్ నాగండ్ల, ప్రధాన కార్యదర్శి రాచర్ల శ్రీనివాస్, కోశాధికారి పెరటి రవీందర్‌రెడ్డితో పాటు అంబటి సతీష్ కుమార్, పెరటి ప్రభాకర్‌రెడ్డి, అలిశెట్టి రమేష్, పిట్ట లక్ష్మీనర్సయ్య, చిదురాల రాజిరెడ్డి, భాస్కర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ వాసుల ఐక్యతను చాటేలా వేడుకలు ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి.

## తాత్కాలిక మెరిట్ జాబితాలపై అభ్యంతరాలు

**భద్రాచలం, ఆగస్టు 27 ( డిడి9 వార్త )**



ఖమ్మం రీజియన్ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2026–27 విద్యా సంవత్సరానికి పార్ట్ టైమ్ ఫ్యాకల్టీ నియామకాల కోసం విడుదల చేసిన తాత్కాలిక మెరిట్ జాబితాలపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. అభ్యర్థులు తమ పేరు, విద్యార్హతలు, మెరిట్ , టెట్ తదితర వివరాల్లో తప్పులుంటే తగిన ఆధారాలతో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం (గురుకులం), ఐటీడీఏ భద్రాచలంలో కార్యాలయ పనిదినాల్లో నేరుగా అభ్యంతరాలు సమర్పించాలని సూచించారు. గడువు అనంతరం వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోమని స్పష్టం చేశారు. వివరాలకు 9949723291ను సంప్రదించాలని కోరారు.

## తొలగించిన ఓట్ల వివరములు బహిర్గతం చేయాలి

- **సర్ పై మరోసారి ప్రచారాన్ని నిర్వహించాలి**
- **సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు**

**భద్రాచలం, ఆగస్టు 27 (డిడి9 వార్త)**

సర్ ప్రక్రియలో తొలగించిన ఓటర్ల వివరాలను గ్రామ వార్డు సభలలో బహిర్గతం చేసి అర్హత కలిగిన ఓటర్లను పునర్దించాలని సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట్రామారావు డిమాండ్ చేశారు. గురువారం 14వ వార్డు పరిధిలో నిర్మించిన గ్రామసభ లో పాల్గొన్న వెంకట రామారావు అధికారులతో పలు విషయాలపై చర్చించి స్థానిక ప్రజలతో కలిసి పలు సమస్యలను బిఎల్ఓ ల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వెంకట రామారావు మాట్లాడుతూ 14వ వార్డు పరిధిలోనే సుమారు 221 ఓట్లు తొలగించబడ్డాయని బిఎల్వోలు తెలియజేస్తున్నారని అన్నారు. తొలగించిన ఓట్ల వివరాలను వార్డు పరిధిలో ప్రజలకు బహిర్గతంగా తెలియజేయాలని కోరారు. తొలగించిన ఓట్ల వివరాలను బహిర్గతం చేయడంతో అర్హత ఉన్న హోటళ్లు స్పందించే అవకాశం ఉంటుందని పొరపాటున తొలగించిన ఓటర్లు స్థానికంగా లేకపోయినా సంబంధిత బంధువులైన అధికారులను కలిసే అవకాశం ఉంటుందని వెంకట్రామారావు అభిప్రాయపడ్డారు. పట్టణ వ్యాప్తంగా నిర్వహించిన వార్డు గ్రామసభల ప్రచారం ఆశించిన స్థాయిలో జరగలేదని ఆ కారణంతోనే సభలకు ఓటర్లు తరలి రాలేదని వెంకట రామారావు స్పష్టం చేశారు. మరో 15 రోజులపాటు తొలగించిన ఓటర్లకు నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో బిఎల్వోలు రాజకీయ పక్షాల సహకారంతో విస్తృత ప్రచారం చేయాలని కోరారు. కుపడిగా గ్రామ వార్డు సభలు నిర్వహించి ఓటర్లు తొలగిస్తే సిపిఎం చూస్తూ ఊరుకోదని వెంకట రామారావు హెచ్చరించారు. ఇప్పటికే పట్టణ వ్యాప్తంగా సిపిఐఎం బూతు లెవల్ ఏజెంట్లు అన్ని వార్డులలో విస్తృతంగా ఓటర్ జాబితా ముసాయిదాపై అధ్యయనం చేస్తున్నారని తెలిపారు.

## సీతమ్మ సాగర్ నీళ్లతో మణుగూరు ను సస్యశ్యామలం చేయాలి..

- **ఈ నెల 29న మంత్రులకు వినతి పత్రం అందజేయనున్న మండల రైతాంగం.**
- **మణుగూరు మాజీ సర్పంచ్ & జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య.**



**మణుగూరు.ఆగస్టు 27(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలంలోని అన్ని చెరువులు, కుంటలను సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నీటితో నింపి, సుమారు 2,000 ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించాలని మణుగూరు రైతాంగం కోరుకుంటుందని మణుగూరు మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గతంలో మన ప్రాంత గోదావరి నీరు ఇతర ప్రాంతాలకు తరలిపోయే పరిస్థితి ఉండేదని, కానీ పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు చొరవతో ఇప్పటికే మారెళ్ళపాడు లిఫ్ట్ ద్వారా తుమ్మల చెరువుకు నీరందించే కార్యక్రమం ప్రారంభానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.ఇదే క్రమంలో మణుగూరు మండల రైతాంగానికి శాశ్వత సాగునీటి వసతి కల్పించేందుకు కింది పనులను ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు.

**రేగులగండి చెరువుకు లిఫ్ట్ ఏర్పాటు..**

అశ్వాపురం మండలం నుండి రేగులగండి చెరువుకు లిఫ్ట్ ద్వారా నీటిని పంప్ చేసి కూనవరం, మద్దులగూడెం, సింగారం గ్రామ రైతుల పొలాలకు రెండు పంటలకు నీరందించాలి.

**మణుగూరు పెద్ద చెరువు నింపుట..**

కట్టువాగు ద్వారా మణుగూరు పెద్ద చెరువును నింపి వందలాది రైతు కుటుంబాలకు అండగా నిలవాలి.

**చెరువుల అనుసంధానం.**

మణుగూరు పెద్ద చెరువు నుండి అన్నారం, కమలాపురం, చిన్నరావిగూడెం మరియు సింగనగూడెం చెరువులకు సీతమ్మ సాగర్ జలాలను మళ్లించాలి. ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తయితే మండలంలో భూగర్భ జలాలు పెరిగి సుమారు 2,000 ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీటి కొరత కూడా తీరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ విషయమై ఈ నెల 29వ తేదీన (29-08-2026) సీతమ్మ సాగర్ ప్రాజెక్టు వద్దకు విచ్చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ, సమాచార శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు గారిని మరియు ఇతర మంత్రులను కలిసి వినతి పత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మణుగూరు మండలంలోని రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష మనిద్దరం దేశానికి రక్ష

**తాడ్వాయి డిడి8 వార్త**



రక్షాబంధన్ శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి నాడు జరుపుకునే పండుగ సోదరీ, సోదరుడికి చేతికి రాఖీ కట్టి నువ్వు నాకు రక్షా నేను నీకు రక్ష అని ప్రతిజ్ఞ చేసుకుంటారు. ఇది కేవలం అన్న చెల్లెల ప్రేమకు మాత్రమే కాదు సమాజంలో ప్రతి ఒక్కరు ఒకరికొకరు రక్షణగా నిలబడే సామాజిక సంకల్పం మరియు సమాజం మొత్తం దేశ రక్షణకు నిలబడేలా స్ఫూర్తిని నింపే పవిత్ర సంస్కృతి వారసత్వ పునాదికి ఆధారంగా నిలబడుతుంది. ఇది వేల సంవత్సరాల పోరా నుండి దేవతలు ఆచరిస్తూ యుగ,యుగాలు వారసత్వం పరంపర కొనసాగుతూ వస్తుంది మునులు దేవతలు ఆచరించినటువంటి మహోన్నత సంస్కృతి మూడు యుగాలను దాటుకొని కలియుగంలో కూడా ప్రసిద్ధమైన వారసత్వ సంపదగా మనకు అందినటువంటిదే ఈ రక్షాబంధన్ అత్యంత శక్తివంతమైన ఆచరణాత్మకమైన పండగల నేటికీ కొనసాగుతుంది. ఇది వ్యక్తిగత స్థాయిలో నేను నీకష్టాల్లో తోడుగా ఉంటా నీవు కూడా నాకు అలాగే ఉండు అని, సామాజిక స్థాయిలో చూసినట్లయితే నేను నుంచి మనం అనే ఆలోచనగా మారి సమాజా రక్షణ కొరకు దృక్పథం బలపడుతుంది. ఇది జాతీయ స్థాయిలో మనం ఇద్దరం అంటే ప్రతి పౌరుడు దేశానికి రక్షగా మారి బాధ్యతగా ప్రవర్తించాలి చట్టాన్ని గౌరవించడం పరస్పర సహకారం అందించి దేశ రక్షణకు నడుం బిగించి ఒకరికొకరు తోడ్పాటున అందించుకోవాలిసిన ఆవశ్యకత ఉంది. ఇప్పుడు మన సమాజం మీద అత్యంత విషపూరితమైన చూపులు కూరలు చాసినటువంటి విధ్వంసకర పరిస్థితులను సృష్టిస్తూ మన సమాజాన్ని ముక్కలు చెక్కలుగా చెట్టుకు ఒకరు పుట్టుకకరు మారే విధంగా మనకు తెలియకుండా మన సమాజంలో అనేక దాడులు జరుగుతున్నాయి. దానిని మనందరం గమనించవలసిన అవసరం ఉంది. ఇప్పుదున్న పరిస్థితులు మన అంశారూక్షాన్ని పెంచే కల్పతరువు అయినటువంటి మన ఆడబిడ్డల మీద జిహాదిలు గుంట నక్కల కాపు కాసి విషపు వల్లలు విసిరి అందులో చిక్కుకొని విలవిలలాడేలా తర్ఫీదు పొందిన వేటగాళ్లు మన సమాజం మీద దాడులు చేస్తున్నారు. కాబట్టి ఇది మన గిరిజన సమూహాల్లో అత్యధికంగా గురికావడం జరుగుతుంది. కాబట్టి ఈ దుష్ప్రణామాలను జాకరుకతో గుర్తిస్తూ మన ఆడబిడ్డ రక్షించుకోవాల్సిన బాధ్యత మన సమాజం పైన ఉంది అలాగే మన సమాజాన్ని రక్షించినట్లయితేనే, దేశానికి రక్షణ కల్పించిన వారము అవుతాము. లేదా మన సంస్కృతి పాచ్యత్యపు విషపు సంస్కృతి గాలికి విలవిలలాడుతూ అంతమయ్యే పరిస్థితి ఉంది. కాబట్టి దేశ రక్షణ అంటే ఆడబిడ్డ రక్షణతో పాటు, సమాజారక్షణ, సంస్కృత సాంప్రదాయ రక్షణ కూడా దేశ రక్షణలో భాగమై ఉంటుంది కాబట్టి సాంస్కృతి పరంగా మనందరం బలపడి దేశానికి బలమైన కట్టబడిన ఒక తాడుల మనందరం నిలబడదాం. అందులో భాగంగానే నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష మనమిద్దరం దేశానికి రక్ష అనే నినాదంతో భవిష్యత్ తరాలకు బాటలు పరిచే బలమైన సంకల్పాన్ని తీసుకుందాం ఈ రక్షాబంధన్ సందర్భంగా.

**డాక్టర్ మైపతి సంతోష్ కుమార్**
**ములుగు జిల్లా వనవాసి కళ్యాణ పరిషత్ కార్యదర్శి.**

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మాగి ముఖేష్ ఎన్నిక

- **మాదిగ సామాజికవర్గ హక్కుల పోరాటానికి,పార్టీ బలోపేతానికి కృషి చేస్తా**
- **నూతన అధ్యక్షుడు మాగి ముఖేష్**



**బోనకల్,ఆగస్టు 27, (డీడీ9వార్త):**

మండల ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షుడిగా చోప్పకట్లపాలెం గ్రామానికి చెందిన మాగి ముఖేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.యువతలో ఉన్న విశేష ఆదరణ,చురుకైన పాత్రే ఆయన ఎన్నికకు ప్రధాన కారణమైంది.ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు,ఎంఎస్పి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కోట హనుమంతరావు మాదిగ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో నూతన కమిటీని అధికారికంగా ప్రకటించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్,ఎంఎస్పి జిల్లా ఇన్చార్జ్ కందికట్ల విజయ్ మాదిగ,ఎంఎస్పి మాజీ అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య మాదిగ,ఖమ్మం జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు,మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ కూరపాటి సునీల్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కమిటీ ఎన్నికను పర్యవేక్షించారు.అధికార ప్రతినిధిగా మంద వినోద్ మాదిగ ప్రధాన కార్యదర్శులుగా మర్రికంటి గంగాధర్ మాదిగ,మధు మాదిగ, ఉపాధ్యక్షులుగా చిలక రవికుమార్ మాదిగ,పవన్ కుమార్ మాదిగ,కోశాధికారిగా మర్రి కిరణ్ కుమార్ మాదిగ కార్యదర్శులుగా డేవిడ్ రాజ్ మాదిగ,యంగల నాగరాజ్ మాదిగ,తోటపల్లి సతీష్ మాదిగ మందకృష్ణ మాదిగకు ముఖేష్ కృతజ్ఞతలు తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు,సహకరించిన జిల్లా నాయకులకు నూతన అధ్యక్షుడు మాగి ముఖేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మండలంలో మాదిగ సామాజికవర్గ హక్కుల పోరాటానికి,పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ మాజీ రాష్ట్ర కార్యదర్శి చిలక నాగరాజు మాదిగ,ఖమ్మం జిల్లా నాయకులు తాటికొండ వెంకటరత్నం మాదిగ,బోనకల్ మాజీ మండల అధ్యక్షుడు బలవంతపు నరసింహారావు మాదిగ,ఎంఎస్పి సీనియర్ నాయకులు తోటపల్లి చిన్న సైదులు మాదిగ,మర్రి కరణం మాదిగ ప్రభాకర్ రావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం లో ఉద్యోగాల పేరుతో 'పైరవీ' దందా?





- ఎమ్మెల్యే పీఏ కేంద్రంగా భారీ వసూళ్ల ఆరోపణలు ?
- రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిరుద్యోగుల నుంచి వసూలు చేసినట్లు ప్రచారం
- రైల్వే ఉద్యోగం పేరుతో మరో రూ.10 లక్షల వ్యవహారం?
- క్యాంపు కార్యాలయం వేదికగా సాగినట్లు ఆరోపణలు..
- సమగ్ర దర్యాప్తుకు డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్,ఆగస్టు 27 ( డిడి9 వార్త )**

ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు ఉద్యోగాల పేరుతో భారీగా డబ్బులు వసూలు చేసినట్లు వస్తున్న ఆరోపణలు భద్రాచలం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు (పీఏ) కేంద్రంగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు బాధితుల వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తుండగా, మొత్తం లావాదేవీలు కోట్ల రూపాయల్లో ఉండవచ్చన్న ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది.

### ఉద్యోగం వస్తుందన్న ఆశతో అప్పులు?

ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు నిరుద్యోగులను నమ్మించినట్లు సమాచారం. మంచి వేతనంతో ఉద్యోగం ఖాయమన్న హామీలను నమ్మిన పలువురు అప్పులు చేసి మరీ డబ్బులు సమకూర్చినట్లు బాధితుల వర్గాలు పేర్కొంటున్నాయి. నియామక ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని చెబుతూ కాలం గడిపినప్పటికీ ఉద్యోగాలు రాకపోవడంతో అసలు వ్యవహారంపై అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది.

### క్యాంపు కార్యాలయం కేంద్రంగా వ్యవహారం?

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కేంద్రంగా చేసుకుని కొందరు వ్యక్తులు నిరుద్యోగులతో పరిచయాలు పెంచుకుని ఉద్యోగాల పేరుతో పైరవీలు సాగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పీఏగా పనిచేస్తున్న వ్యక్తి పరిచయాలు, హోదాను ప్రస్తావిస్తూ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో డబ్బులు చెల్లించిన కొందరు తమ నగదు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్, పరీక్ష, మెరిట్, నియామక ఉత్తర్వులు వంటి అధికారిక ప్రక్రియ ఉంటుంది. ఈ నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు చెల్లిస్తే ఉద్యోగం ఇప్పిస్తామంటూ నమ్మించినట్లు వస్తున్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. కొందరికి నియామక పత్రాల పేరుతో పత్రాలు అందించినట్లు కూడా ప్రచారం జరుగుతుండటంతో వాటి ప్రామాణికతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### రైల్వే ఉద్యోగం పేరుతో రూ.10 లక్షలు?

ఇదే వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని రైల్వే శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ మరో వ్యక్తి ద్వారా రూ.10 లక్షల వరకు వసూలు చేసినట్లు మరో ఆరోపణ వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలోనూ ఎమ్మెల్యే పీఏ మధ్యవర్తిగా వ్యవహరించినట్లు బాధితుల వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రైల్వే ఉద్యోగాల పేరుతో జరిగినట్లు చెబుతున్న లావాదేవీలపైనా సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు కోరుతున్నారు.

### ఎమ్మెల్యేకు తెలుసా.. తెలియదా?

పీఏ చుట్టూ వరుసగా ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారం ఎమ్మెల్యేకు తెలిసే జరిగిందా? లేక ఆయన పేరు, హోదాను కొందరు వ్యక్తులు తమ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. క్యాంపు కార్యాలయం పేరుతో ఉద్యోగాల వ్యవహారం సాగినట్లు ఆరోపణలు రావడంతో దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే, ప్రస్తుతానికి ఎమ్మెల్యే పాత్ర ఉందని నిర్ధారించే అధికారిక ఆధారాలు బహిరంగంగా వెలుగులోకి రాలేదు. ఆరోపణలు, ప్రచారంగా ఉన్న అంశాలపై అధికారిక దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు తేలనున్నాయి.

### గత ఆరోపణల నేపథ్యంలో మళ్లీ కలకలం

సదరు ఎమ్మెల్యే కార్యాలయానికి సంబంధించి గతంలోనూ కొన్ని ఆరోపణలు, వివాదాలు తెరపైకి వచ్చినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. కల్యాణలక్ష్మి పథకం, ఇసుక రీచ్‌లకు సంబంధించిన వ్యవహారాల్లో గతంలో వినిపించిన ఆరోపణల నేపథ్యంలో తాజా ఉద్యోగాల ఆరోపణలు రాజకీయ వర్గాల్లో మరింత చర్చకు దారితీశాయి. అయితే గత ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారితమైన అంశాలను, ప్రస్తుతం వినిపిస్తున్న ఆరోపణలను వేర్వేరుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### ఆధారాలతో బాధితులు ముందుకొస్తారా?

ఉద్యోగాల కోసం డబ్బులు చెల్లించినట్లు చెబుతున్న కొందరి వద్ద నగదు చెల్లింపులకు సంబంధించిన వివరాలు, బ్యాంకు లావాదేవీలు, వాట్సాప్ సంభాషణలు, నియామక పత్రాలుగా ఇచ్చిన పత్రాలు ఉన్నట్లు సమాచారం. బాధితులు అధికారికంగా పోలీసులను ఆశ్రయిస్తే వ్యవహారానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఎంతమంది నుంచి డబ్బులు వసూలు చేశారు? ఎంత మొత్తం చేతులు మారింది? ఎవరు మధ్యవర్తులుగా వ్యవహరించారు? డబ్బులు ఎవరికి చేరాయి? క్యాంపు కార్యాలయం పేరును ఎలా ఉపయోగించారు? నియామక పత్రాలు అసలైనవేనా? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు జరగాల్సి ఉంది. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బాధితుల డబ్బులు తిరిగి ఇప్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న పీఏ, సంబంధిత వ్యక్తులు, ఎమ్మెల్యే తరఫున అధికారిక వివరణ వెలువడితేనే ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# రెండు వర్గాల మధ్య ఘర్షణ.. యువకుడి మృతి

### మణుగూరు ఏరియా స్పోర్ట్స్ గ్రౌండ్ లో ఘటన.

**మణుగూరు.ఆగస్టు 27 (డి డి 9వార్త)**





మణుగూరు. పాత గొడవల నేపథ్యంలో యువకుడిపై కొంతమంది వ్యక్తులు దాడి చేసి హత్య చేసిన ఘటన మణుగూరులో గురువారం నాడు చోటుచేసుకుంది. మృతుడు సింహాద్రి శివకుమార్ @ శివ (28) హైదరాబాద్‌లో ఇంటీరియర్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శివ వద్ద పనిచేసే సుందరయ్య నగర్ కు చెందిన సతీష్ తో జరిగిన వివాదాన్ని మనసులో పెట్టుకున్న MK గ్యాంగ్ లీడర్ అయిన రమాకాంత్ @ రమ్మీ @ జెట్టి మరియు అతని అనుచరులు శివను మణుగూరుకు వస్తే చంపేస్తామని ఫోన్ ద్వారా బెదిరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో 27-08-2026 ఉదయం 07.00 గంటలకు శివ హైదరాబాద్ నుండి మణుగూరుకు వచ్చాడు. MK గ్యాంగ్ లీడర్ రమాకాంత్ @ రమ్మీ @ జెట్టి ఫోన్ చేసి శివ ను నేతాజీ గ్రౌండ్ కు రమ్మనగా శివ తన ఇంటి ప్రక్కన ఉన్న ఉదయ్‌కుమార్ తో కలిసి నేతాజీ గ్రౌండ్‌కు వెళ్లగా, అక్కడ ముందుగా పథకం ప్రకారం వేచి ఉన్న రమాకాంత్ @ జెట్టి, భరత్, సాధిక్, వినయ్, ధినేష్, జంపయ్య, ప్రసాద్ తదితరులు శివపై మూకుమ్మడిగా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఉదయ్‌కుమార్‌పై కూడా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన శివను కుటుంబ సభ్యులు సుమారు మధ్యాహ్నం 12:30 గంటలకు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే మణుగూరు గురువారం నాడు జరిగిన సంఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి, భవిష్యత్తు లో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలని మణుగూరు ప్రజలు కోరుతున్నారు.

# భోపాల్ మ్యూజియం తరహాలో భద్రాచలం ట్రైబల్ మ్యూజియం

- భోపాల్ నేషనల్ ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించిన ఐటీడీఏ పీవో బి.రాహుల్

**భద్రాచలం , ఆగస్టు 27 (డిడి9 వార్త)**



గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, జీవన విధానాన్ని ప్రతిబింబించేలా భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియంను అన్ని హంగులతో ఆధునీకీకరించి పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ లోని ఇందిరా గాంధీ రాష్ట్రీయ మానవ సంగ్రహాలయ (నేషనల్ ట్రైబల్ మ్యూజియం)ను గురువారం ఐటీడీఏ యూనిట్ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. నేషనల్ ట్రైబల్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచిన వివిధ గిరిజన తెగలకు సంబంధించిన కళాఖండాలు, పెయింటింగ్ చిత్రాలు, సంప్రదాయ వస్తువులు, కలపతో రూపొందించిన కళాకృతులు, గిరిజనుల నివాస విధానాన్ని ప్రతిబింబించే తడకల ఇళ్లను పీవో బి.రాహుల్ పరిశీలించారు. ఆయా ప్రదర్శనల విశిష్టత, వాటి వెనుక ఉన్న గిరిజన సంస్కృతి, చరిత్రకు సంబంధించిన వివరాలను మ్యూజియం డైరెక్టర్ ప్రొఫెసర్ అమితాబ్ పాండేను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ భోపాల్ నేషనల్ ట్రైబల్ మ్యూజియంలో గిరిజన సంస్కృతి, జీవన విధానాన్ని సహజత్వం ఉట్టిపడేలా అద్భుతంగా ప్రదర్శించారని ప్రశంసించారు. మ్యూజియం వెలుపల పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాటు చేసిన కొండ ప్రాంతం, ఇతర నిర్మాణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. ఇదే తరహాలో భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియంను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియానికి సంబంధించిన కాఫీ టేబుల్ బుక్ ను ప్రొఫెసర్ అమితాబ్ పాండేకు పీవో బి.రాహుల్ అందజేశారు. భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ప్రత్యేకతలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్ , ఏపీవో పవర్ వేణు, ఏవో సున్నం రాంబాబు, మ్యూజియం ఇన్ చార్జి వీరాస్వామి, నేషనల్ ట్రైబల్ మ్యూజియం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళల మనసు దోచుకునే శ్రావణమాసం..

### డి సి సి చైర్మన్ శ్రీమతి తోట దేవి ప్రసన్న.



**మణుగూరు.ఆగస్టు 27(డి డి 9వార్త)**

శ్రావణ మాసంలో మహిళలు గాజుల వేడుక చేసుకోవడం.. గౌరీదేవిని, లక్ష్మీదేవిని కొలవడం ఆనవాయితీగా వస్తున్నటువంటి సంప్రదాయం. భద్రాది కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బసవతారక కాలనీ పంచాయితీ పరిధి లో గల అమ్మవారి ఆలయంలో గురువారం నాడు శ్రావణ మాస గాజులు వేసుకునే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి తోట దేవి ప్రసన్న పాల్గొనడం జరిగింది. ఆడవాళ్లు రంగు రంగుల గాజులు చేతులకు ధరించి అలంకరించుకుంటే వారి సౌభాగ్యాన్ని దేవత అయిన పార్వతి దేవి అనుగ్రహం పొందుతారని నమ్ముతారు. ఈ శ్రావణ మాసంలో గాజులు ధరించడం వల్ల అదృష్టం ఆనందం సంపద వస్తాయని పుణ్యస్త్రీలు నమ్ముతారు. గాజులు అలంకారమే కాదు ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంచుతాయని నమ్మకం. ఈ మాసంలో గాజులు ధరించడం వల్ల కుటుంబంలో ఐక్యత, శ్రేయస్సుకు నిదర్శనం. ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రావణమాసం అంటే భక్తి ఆధ్యాత్మికత నిండిన పవిత్ర మాసం అని, ఈ శ్రావణ మాసంలో జిల్లా ప్రజలందరి ఇళ్లలో సుఖ సంతోషాలు, శాంతి ఐశ్వర్యం నిండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని ఆమె తెలియజేశారు.

## బాన్సువాడ నియోజకవర్గంలో పలు వివాహ వేడుకలకు హాజరైన పోచారం శ్రీనివాసరెడ్డి



**బాన్సువాడ, ఆగస్టు 27(డిడి9 వార్త):**

బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో గురువారం జరిగిన పలు వివాహాది శుభకార్యాలకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఆయనతో పాటు పోచారం శంభురెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.బాన్సువాడ పట్టణంలోని జీఆర్ఆర్ గార్డెన్స్లో పాత బాన్సువాడ వాస్తవ్యులు ప్రతిమ–నరేష్‌రెడ్డి దంపతుల కుమార్తె సోహణరెడ్డి వివాహానికి హాజరైన పోచారం శ్రీనివాసరెడ్డి, నూతన వధూవరులు సోహణరెడ్డి–రుత్విక్‌రెడ్డిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని అంచురి కన్వెన్షన్‌లో పోచారం శ్రీనివాసరెడ్డి సమీప బంధువులు నాయిని అనురాధ–నరసింహారెడ్డి దంపతుల కుమారుడు భువన చంద్రరెడ్డి వివాహానికి హాజరై వధూవరులు భువన చంద్రరెడ్డి–శివాణిని ఆశీర్వదించారు.బాన్సువాడలోని భారత్ గార్డెన్స్లో ఇబ్రాహీంపేట్‌కు చెందిన ఊరటి బాలమణి–సాయిలు దంపతుల కుమారుడు సాయికుమార్ వివాహానికి హాజరై సాయికుమార్–శ్రీలేఖ దంపతులను ఆశీర్వదించారు.అదేవిధంగా మీనా గార్డెన్స్లో బాన్సువాడ (మీర్జాపూర్) వాస్తవ్యులు సబ్బిడి మంజుల–హన్మండ్లు దంపతుల కుమార్తె సౌమ్య వివాహానికి హాజరై సౌమ్య–విష్ణు నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.వర్ని మండల కేంద్రంలోని సీసీడీ ఫంక్షన్ హాల్లో ఎస్ఎన్‌పురం వాస్తవ్యులు చోడే శ్రీదేవి–శ్రీనివాస్‌రావు దంపతుల కుమార్తె పవిత్ర వివాహానికి హాజరై పవిత్ర–సామ్రాట్ దంపతులను ఆశీర్వదించారు.ఈ వివాహ వేడుకల్లో బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రముఖులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు27 (డిడి9 వార్త):**

అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. గురువారం నిజామాబాద్ నగరంలోని 19వ డివిజన్ కంటేశ్వర్ ప్రాంతంలో బీఎల్ఓలు ఇంటింటికీ తిరుగుతూ నోటీసులు అందిస్తున్న తీరును కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ జరగని వారికి, పేరు, వయస్సు వంటి అంశాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు హియరింగ్‌కు హాజరుకావాలని నోటీసులు ఇస్తున్న నేపథ్యంలో ఇప్పటివరకు ఎంతమందికి అందజేశారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒకవేళ నిర్ణీత సమయానికి ఓటర్లు రాకపోతే వారికి మరోమారు నోటీసు ఇవ్వాలని, నోటీసుల అందజేత సమయంలోనే ధృవీకరణ పత్రాలు ఇస్తే అక్కడికక్కడే స్వీకరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బీఎల్ఓ సూపర్ ఇంటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో వృక్ష బంధన్

### చెట్టుకు రక్షణగా ఉంటామంటూ రాఖీలు కట్టిన విద్యార్థులు

**ఆదిలాబాద్ జిల్లా, సోనాల / బోథ్: మండలం. డిడి9 వార్తా:-**

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలకు నీళ్లు పోసి రాఖీలు కట్టారు. మొక్కకు నేను రక్ష, నాకు మొక్క రక్ష అంటూ రాఖీలు కట్టడం జరిగింది. పర్యావరణ పరిరక్షణలో మొక్కల పాత్ర గురించి ప్రిన్సిపల్ అనురాధ విద్యార్థులకు వివరించారు. కాగా ఏపీవో ఆధ్వర్యంలో విద్యార్థినిలు విద్యార్థులకు రాఖీలు కట్టి సహోదర భావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వృక్షశాస్త్రం ఉపాధ్యాయుడు పర్యావరణ ప్రేమికుడైన ఎస్. ప్రవీణ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## తాడ్కోల్ చౌరస్తా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### లారీ ఢీకొని నాలుగేళ్ల బాలిక మృతి – ముగ్గురికి గాయాలు

**బాన్సువాడ, ఆగస్టు 27(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తా వద్ద గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.టాటా లారీ వెనుక నుంచి మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టడంతో నాలుగేళ్ల బాలిక జైనాబ్ ఫాతిమా అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి.వాసవి కాలనీకి చెందిన మహమ్మద్ రఫీ (36) తన మోటార్‌సైకిల్ పై కుమారులు మహమ్మద్ అర్హాన్ (8), మహమ్మద్ అయాన్ (6), కుమార్తె జైనాబ్ ఫాతిమా (4)లను పాఠశాలలో దించేందుకు గురువారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరారు.సుమారు 9 గంటల సమయంలో తాడ్కోల్ చౌరస్తా వద్దకు చేరుకున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన టాటా లారీ మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది.లారీ డ్రైవర్ షేక్ మొహమ్మద్, దెగ్లూర్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు తెలిపారు.లారీని అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా పేర్కొన్నారు. ప్రమాదం ధాటికి మోటార్‌సైకిల్‌పై ఉన్న నలుగురూ రోడ్డుపై పడిపోయారు.ఈ క్రమంలో నాలుగేళ్ల చిన్నారి జైనాబ్ ఫాతిమా తలపై నుంచి లారీ ముందు భాగంలోని ఎడమ వైపు టైరు వెళ్లడంతో తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఆమె తండ్రి మహమ్మద్ రఫీతో పాటు మహమ్మద్ అర్హాన్, మహమ్మద్ అయాన్‌లకు గాయాలయ్యాయి. ఘటనపై మృతురాలి తండ్రి మహమ్మద్ రఫీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాన్సువాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై చట్టప్రకారం చర్యలు తీసు కునేందుకు దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: షబ్బీర్ అలీ



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 27(డిడి9 వార్త):**

మాచారెడ్డి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన పీఏసీఎస్ చైర్మన్‌గా నౌసిలాల్ నాయక్ ప్రమాణ స్వీకారం చేయగా, నూతన పాలకవర్గ సభ్యులు సైతం ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు.అనంతరం చైర్మన్ నౌసిలాల్ నాయక్‌ను మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని అన్నారు.రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతులకు అవసరమైన రుణాలు, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలను సకాలంలో అందించడంలో పీఏసీఎస్ లు కీలక పాత్ర పోషించాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, సాగునీటి వనరుల అభివృద్ధి, రైతు బీమా వంటి కార్యక్రమాలతో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిని వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.రైతు కుటుంబం ఆర్థికంగా బలపడితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, రైతులకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.పీఏసీఎస్లు కేవలం రుణాలు అందించే సంస్థలుగా కాకుండా రైతుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే కేంద్రాలుగా పనిచేయాలని షబ్బీర్ సూచించారు.నూతన చైర్మన్ నౌసిలాల్ నాయక్ రైతులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు సమానంగా సేవలు అందించాలని కోరారు. PACSను ఆర్థికంగా బలోపేతం చేసి రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

మాచారెడ్డి మండల రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానని షబ్బీర్ హామీ ఇచ్చారు.కామారెడ్డి నియోజకవర్గంలో గ్రామీణ మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.ప్రజా సంక్షేమంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, గ్రామీణాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో మాచారెడ్డి మాజీ ఎంపీపీ సురేష్ నర్సింగరావు, కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మాచారెడ్డి సర్పంచ్ సంతోష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, భిక్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహ ఆలయ చైర్మన్ కమలాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, కౌన్సిలర్ మోతిలాల్, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్, మాజీ సొసైటీ చైర్మన్లు పూల్ చంద్, స్వామిగౌడ్, రాజమౌళి, సత్యనారాయణ, బాలరాజుగౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకులారా.. బహిరంగ చర్చకు సిద్ధమా?

- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పొంబోయిన ముత్తయ్య**

**గుండాల, ఆగస్టు 27 డి డి 9 వార్త :**



గుండాల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఊకె బుచ్చయ్య అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పొంబోయిన ముత్తయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలకు తాము సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని, బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళిత బంధు, బీసీ బంధు వంటి పథకాల అమలులో జరిగిన విషయాలపై, ప్రజలకు ఎదురైన ఇబ్బందులపై బహిరంగంగా చర్చిద్దామని అన్నారు. అలాగే పాయం వెంకటేశ్వర్లు గారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని, ఆయన విద్యార్థి దశ నుంచే ప్రజా సేవలో కొనసాగుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించిన ముత్తయ్య, రైతు రుణమాఫీ విషయంలో కూడా గత ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య స్పష్టమైన తేడా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేసిందని తెలిపారు. ఆరు గ్యారంటీలపై విమర్శలు చేసే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను బీఆర్ఎస్ నాయకులు గమనించాలని సూచించారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. "తాటాకు చప్పుళ్లకు, ఉడత ఊపులకు భయపడే వారు కాంగ్రెస్ నాయకులు కాదు. ఎలాంటి అంశంపైనైనా ఎక్కడైనా బహిరంగ చర్చకు మేము సిద్ధం. బీఆర్ఎస్ నాయకులు కూడా చర్చకు సిద్ధమా?" అని పొంబోయిన ముత్తయ్య ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వాంకుడోత్ రమేష్, ఎస్.కె. వాజీద్ పాషా, ఎస్.కె. కాసీం, ఎస్.కె. ఇస్రార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పోలీసు-ప్రజల సత్సంబంధాల బలోపేతమే లక్ష్యం

- **ఇచ్చోడ మండలం దాబా బి గ్రామంలో 'పోలీసులు మీకోసం' కార్యక్రమం**
- **గంజాయి, గుడుంబాపై ఉక్కుపాదం.. సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలి**
- **రోడ్డు భద్రతపై అవగాహన.. హెల్మెట్‌తో ప్రమాదాల శాతం తగ్గే అవకాశం**
- **మహిళలు, బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన.. ఉచిత వైద్య శిబిరం నిర్వహణ**
- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్**

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్ )**





ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం, గ్రామాల్లో పోలీసు–ప్రజల సత్సంబంధాలను బలోపేతం చేయడం, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఆదిలాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో భాగంగా గురువారం ఇచ్చోడ మండలం దాబా బి గ్రామంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం, ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభ్యులు ఆదివాసి సంస్కృతి మరియు డప్పు వాయిద్యాలు నడుమ జిల్లా ఎస్పీకి ఘన స్వాగతం పలికారు. మొదటగా గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించి, పోలీసు మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల భద్రత, ఆరోగ్యం, విద్య, యువత భవిష్యత్తు కోసం పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. గ్రామస్తులు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి, గుడుంబా, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామంలో ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నా, విక్రయిస్తున్నా లేదా మాదకద్రవ్యాల వినియోగానికి పాల్పడుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయికి దూరంగా ఉండాలని యువతకు సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులు, యువతలో అవగాహన పెంచాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు గంజాయి పండించిన రైతుల కు ప్రభుత్వ పథకాలు వర్తించకుండా సిఫార్సు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను వివరించిన జిల్లా ఎస్పీ, గ్రామాల్లో సీసీటీవీల ఏర్పాటుతో నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించడం సులభమవుతుందని అన్నారు. గ్రామ భద్రతలో సీసీటీవీలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజలు వీటి ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీ తెలిపారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, నంబర్ ప్లేట్ లేని వాహనాలను ఉపయోగించకూడదని సూచించారు. దొంగిలించబడిన వాహనాలను కొనుగోలు చేయడం లేదా ఉపయోగించడం కూడా నేరమేనని తెలిపారు. వాహనం కొనుగోలు చేసే సమయంలో ఆర్సీ, ఇన్సూరెన్స్, ఇతర సంబంధిత పత్రాలను తప్పనిసరిగా పరిశీలించి, వాహనం వివరాలను ధృవీకరించుకోవాలని సూచించారు. హెల్మెట్ వినియోగంతో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం గణనీయంగా తగ్గుతుందని, జిల్లాలో హెల్మెట్ వినియోగం పెరగడంతో, రోడ్డు భద్రతా నియమాలు పాటించడంతో ప్రమాదాలు సుమారు 25 శాతం వరకు తగ్గినట్లు తెలిపారు. కుటుంబాల్లో మహిళలు కూడా తమ భర్తలు, పిల్లలు హెల్మెట్ ధరించేలా ప్రోత్సహించాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు 10 హెల్మెట్లను పంపిణీ చేశారు.ఇచ్చోడ విద్యాలయ పాఠశాల విద్యార్థులు రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఆకట్టుకునే విధంగా స్కిట్ ద్వారా రోడ్డు భద్రత, డ్రగ్స్‌కు దూరంగా ఉండటం వంటి అంశాలపై సందేశాన్ని అందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను పెంపొందించుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంప్‌ను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. వైద్యులు మహిళలు, బాలికలకు సంబంధించిన PCOD, రక్తహీనత (లో బ్లడ్/అనీమియా) వంటి సమస్యలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా డెంగ్యూ, మలేరియా నివారణ, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి సమస్యలతో బాధపడేవారికి అవసరమైన చోట ఉచిత కంటి శస్త్రచికిత్స వంటి వైద్య సేవలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, జొన్నలు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఆహారంలో భాగంగా చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. అలాగే నకిలీ బాబాలు, మోసగాళ్ల మాటలను నమ్మి ప్రజలు డబ్బులు కోల్పోవద్దని, అనుమానాస్పద వ్యక్తులు లేదా మోసపూరిత కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.పాఠశాల విద్యార్థులు జిల్లా ఎస్పీకి రాఖీని కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్వీక్ సాయి కొట్టే ఐపీఎస్, ఇచ్చోడా సీఐ కె నరేష్ కుమార్, గ్రామ సర్పంచ్ ఈశ్వర్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, ఆదిలాబాద్ ప్రైవేట్ వైద్యులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నూతన రిడింగ్ రూమ్ ప్రారంభం

- **యువత గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**డిడి 9 వర్త గుడిహత్నూర్:**



పుస్తక పఠనాన్ని దినచర్యగా మార్చుకుని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా యువతకు సూచించారు. గుడిహత్నూర్ మండలం తోషం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఐటీడీఏ పీఓ మంద మకరందుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కలెక్టర్, పీఓ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏకరూప దుస్తులను అందజేశారు. అనంతరం శ్రీ శ్రీ శ్రీ పరమహంస సద్గురు పూలాజీబాబా 102వ జన్మదిన మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంత యువత పోటీ పరీక్షలకు, ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లకు సిద్ధమయ్యేందుకు గ్రంథాలయం, రీడింగ్ రూమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. గ్రంథాలయాల నిర్వహణకు ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి, పాఠకుల హాజరు వివరాలను ప్రతిరోజూ నమోదు చేయాలని సూచించారు. గ్రామాల్లో విద్యార్థులు, యువత, మహిళలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన యూనిఫామ్‌లతో పాటు ఉచితంగా బూట్లు, పుస్తకాలు, బ్యాగులు అందిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు తదితర సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### ఓటర్ల సందేహాలు నివృత్తి చేయాలి

ఐటీడీఏ పీఓ మంద మకరందు మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మృతులు, వలస వెళ్లినవారు, డబుల్ ఎంట్రీలు ఉంటే వాటిని ఏఎస్‌డీ జాబితాలో చేర్చాలని సూచించారు. పొరపాటున ఏఎస్‌డీ జాబితాలో పేరు నమోదైతే ఫారం–6 ద్వారా సరిచేసుకునే అవకాశం కల్పించాలని తెలిపారు. ఫారం–6, డిక్లరేషన్ ఫారాలను అందుబాటులో ఉంచి ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ దరఖాస్తులు, వివరణలు స్వీకరించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి, జీపీవో, బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేసి ఓటర్ల జాబితా ప్రక్షాళనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### యువతకు ఎంతో ఉపయోగం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ గ్రామస్తులు, అధికారుల సహకారంతో నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, పోటీ పరీక్షలకు సిద్ధమై ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గ్రంథాలయానికి అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ సర్పంచ్ పద్మ కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీఓ మంద మకరందు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యలకు రాఖీలు కట్టారు.

కార్యక్రమంలో డీపీవో రమేష్, డీఎల్పీవో ఫణిందర్, తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీవో ఇంతియాజ్, ఎంఈవో గోపాల్‌సింగ్, సర్పంచ్ పద్మ, ఉప సర్పంచ్ షేహనాజ్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518